11th YEAR ANNIVERSARY
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 05 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 16 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 05 PAGES : 8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : THADEPALLI GUDEM SUN 16 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా జగన్ ట్వీట్

- దివంగత నటుడు సూపర్ స్టార్ కృష్ణకు నివాళులర్పించిన వైఎస్ జగన్
- కృష్ణ వర్ధంతి సందర్భంగా సోషల్ మీడియాలో పోస్ట్
- తెలుగు సినిమాకు నూతన మార్గాలు చూపిన గొప్ప నటుడని కితాబు
- ఎన్నో ప్రయోగాలు చేసిన సాహసిగా అభివర్ణన
- ఇండస్ట్రీలో ఎందరికో అండగా నిలిచిన మానవతావాది అని ప్రశంస

వివరాలు 2లో..

విశాఖ సదస్సు అంచనాలకు మించి అద్భుత విజయం...

3 రోజుల్లో రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు

- విశాఖలో విజయవంతంగా ముగిసిన సీఐఐ భాగస్వామ్య సదస్సు
- మూడు రోజుల్లో రూ.13.25 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు
- అంచనాలకు మించి 30 శాతం అధికంగా తరలివచ్చిన పెట్టుబడులు
- ఈ ఒప్పందాల ద్వారా 16.31 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం
- ఇంధన, పరిశ్రమల, మౌలిక వసతుల రంగాలకు అత్యధిక వాటా
- సగానికి పైగా ఒప్పందాలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే ఖరారు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో విశాఖ సాగర తీరం సరికొత్త చరిత్రను లిఖించింది. రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ సంయుక్తంగా నిర్వహించిన 30వ భాగస్వామ్య సదస్సు అంచనాలకు మించి అద్భుత విజయం సాధించింది. రాష్ట్రానికి పెట్టుబడుల సునామీని తీసుకొచ్చింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో ఏకంగా రూ.13,25,716 కోట్ల విలువైన పెట్టుబడులపై ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 16,31,188 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

అంచనాలకు మించి పెట్టుబడుల వెల్లువ

వాస్తవానికి ఈ సదస్సును రెండు రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం మొదట భావించింది. సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేసింది. అయితే, పారిశ్రామికవేత్తల నుంచి అనూహ్య స్పందన రావడంతో సదస్సును మరో రోజు పొడిగించాల్సి వచ్చింది. పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థలు భారీగా తరలిరావడంతో అంచనాలను మించి ఏకంగా 30 శాతం అధికంగా, అంటే రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి రావడం ప్రభుత్వ వర్గాల్లోనూ కొత్త ఉత్సాహాన్ని నింపింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. క్రమం తప్పకుండా రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశాలు నిర్వహిస్తూ పరిశ్రమలకు శరవేగంగా అనుమతులు మంజూరు చేశారు.

వివరాలు 2లో..

ఏపీలో పెట్టుబడుల సునామీ...

సెమీకండక్టర్ల నుంచి షిప్ యార్డ్ వరకు కీలక ఒప్పందాలు

- ఏపీలో సెమీకండక్టర్, చిప్ డిజైనింగ్ యూనిట్ ఏర్పాటుకు సిలికాన్ జెన్ కు ఆహ్వానం
- క్వాంటం టెక్నాలజీలో దేశానికి ఏపీ మార్గదర్శనం చేస్తుందన్న మంత్రి లోకేశ్
- రూ.5 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు గోవా షిప్ యార్డ్స్ సుముఖత
- అమరావతిలో 12 ఎకరాల్లో ఏఐఎఫ్ఎఫ్ ఫుట్ బాల్ స్టేడియం నిర్మాణం
- పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులకు జెలెస్ట్రా పవర్ కు విజ్ఞప్తి
- శ్రీకాకుళం ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఏఏఐ, ఏపీఏడీసీ మధ్య కీలక ఒప్పందం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమగ్రాభివృద్ధి పథంలో నడిపించేందుకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం వ్యూహాత్మ కంగా అడుగులు వేస్తోంది.

వివరాలు 2లో..

సీఐడీ విచారణకు హాజరైన రానా, యాంకర్ విష్ణుప్రియ

- ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో వేగవంతమైన విచారణ
- రానా, విష్ణుప్రియ స్టేట్‌మెంట్లు రికార్డ్ చేసిన అధికారులు
- ఇప్పటికే నటుడు ప్రకాశ్ రాజ్‌ను విచారించిన సీఐడీ

పెన్ పవర్ డెస్క్:ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో సీఐడీ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసుకు సంబంధించి ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి, యాంకర్ విష్ణుప్రియ ఈరోజు సీఐడీ సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో అధికారులు వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. యాంకర్ విష్ణుప్రియ మూడు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్

వివరాలు 2లో..

అభివృద్ధి చేసింది ఎవరు? అధోగతి పాలుచేస్తున్నది ఎవరు? మీరే గమనించండి

- కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల విమర్శలు
- జగన్ హయాంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేశామని వెల్లడి
- ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్యాన్ని పేదలకు దూరం చేస్తోందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో తమ అధినేత జగన్మోహన్ రెడ్డి విశాఖను బెంగుళూరు,

వివరాలు 2లో..

కులతత్వ విషం, ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు

- దశాబ్దకాలంగా ఓటములపై కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- మాజీ ప్రధానులతో పని చేసిన కాంగ్రెస్ సీనియర్లు రాహుల్ గాంధీ తీరుతో అసంతృప్తిగా ఉన్నారని వ్యాఖ్య
- కులతత్వ విషాన్ని చిమ్ముతున్న వారిని ప్రజలు తిరస్కరిస్తారని మరోసారి రుజువైందన్న మోదీ

పెన్ పవర్ డెస్క్:కులతత్వ విషాన్ని చిమ్మేవారిని, ముస్లిం లీగ్-మావోయిస్టు భావజాలం కలిగిన వారిని బీహార్ ప్రజలు తిరస్కరించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సూరత్‌లో స్థిరపడిన బీహారీలు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, దశాబ్దకాలంగా ఓటములపై కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌ను ప్రజలు

వివరాలు 2లో..

ముఠాల మూలాలు తేల్చండి..

విశాఖ గోమాంసం ఘటనపై పవన్ కల్యాణ్ సీరియస్

- విశాఖ గోమాంసం నిల్వలపై డిప్యూటీ సీఎం పవన్ సీరియస్
- ముఠాల మూలాలను వెంటనే తేల్చాలని పోలీసులకు ఆదేశం
- నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరిక
- పోలీస్ కమిషనర్‌తో స్వయంగా మాట్లాడి వివరాలు సేకరణ
- కోల్డ్ స్టోరేజీలో 1.89 లక్షల కిలోల గో మాంసం స్వాధీనం

వివరాలు 2లో..

విశాఖ సదస్సులో మన చిన్న కమ్మ కల్యాణ్ గారు కనిపించడంలేదంటబ్బా!

- పవన్ కల్యాణ్‌పై అంబటి రాంబాబు సెటైర్
- విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్‌కు పవన్ ఎందుకు రాలేదని ప్రశ్న
- చంద్రబాబు, లోకేశ్‌లను కూడా తన పోస్టుకు ట్యాగ్ చేసిన అంబటి
- సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన అంబటి వ్యాఖ్యలు

పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ (భారత పరిశ్రమల సమాఖ్య) భాగస్వామ్య సదస్సును ప్రస్తావిస్తూ

వివరాలు 2లో..

'ఐ-బొమ్మ' ద్వారా వందల కోట్లు ఆర్జించిన ఇమ్మడి రవి!

- ఐ-బొమ్మ వెబ్‌సైట్ ప్రధాన నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్
- హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో అదుపులోకి తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు
- కరీబియన్ దీవుల నుంచి పైరసీ నెట్‌వర్క్ నిర్వహణ
- ఐ-బొమ్మ వల్ల ఇండస్ట్రీకి రూ.22 వేల కోట్ల నష్టం అంచనా
- నిందితుడి ఫ్లాట్‌లో హార్డ్ డిస్కులు, హెచ్‌డీ ప్రింట్లు స్వాధీనం
- రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న పోలీసులు

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:తెలుగు సినీ పరిశ్రమను దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న పైరసీ భూతాన్ని అంతమొందించే దిశగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గట్టి దెబ్బకొట్టారు. కొత్త సినిమాలు విడుదలైన గంటల వ్యవధిలోనే హెచ్‌డీ ప్రింట్లను ఉచితంగా అందిస్తూ నిర్మాతలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన 'ఐ-బొమ్మ' వెబ్‌సైట్ ప్రధాన నిర్వాహకుడు, సూత్రధారి ఇమ్మడి రవిని అరెస్టు చేశారు. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ చేరుకున్న అతడిని, కూకట్‌పల్లిలోని రెయిన్ విస్టా అపార్ట్‌మెంట్‌లో నవంబర్ 14న చాకచక్యంగా అదుపులోకి



ఏపీ పాలసీలు అద్భుతం...

సీఎం చంద్రబాబును ప్రశంసించిన రేమాండ్స్ గ్రూప్

- శ్రీసిటీకి అదనంగా 6 వేల ఎకరాల భూమి కేటాయింపు
- సీఐఐ సదస్సులో వెల్లువెత్తిన పెట్టుబడులు
- రాయలసీమలో రూ.1201 కోట్లతో రేమాండ్స్ గ్రూప్ మూడు ప్రాజెక్టులు
- 18 నెలల కాలంలో రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్న సీఎం
- శ్రీసిటీలో రూ.2320 కోట్ల విలువైన కొత్త ఒప్పందాలు
- ఏపీలో పరిశ్రమలకు అనుమతులు వేగంగా వస్తున్నాయన్న రేమాండ్స్ గ్రూప్

వివరాలు 2లో..

విశాఖ సదస్సు అంచనాలకు మించి అద్భుత విజయం...

- మొదటి పేజీ తరువాయి

దీనికి కొనసాగింపుగా, రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి స్వయంగా సింగపూర్, యూఏఈ, లండన్ వంటి దేశాల్లో పర్యటించి పారిశ్రామికవేత్తలను సదస్సుకు ఆహ్వానించారు. ఈ కృషి ఫలించి భాగస్వామ్య సదస్సు రికార్డు స్థాయి విజయాన్ని నమోదు చేసింది.

ముఖ్యమంత్రి సమక్షంలో అధిక శాతం ఒప్పందాలు

మూడు రోజుల పాటు జరిగిన ఈ పెట్టుబడుల మేళాలో సింహభాగం ఒప్పందాలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే జరగడం విశేషం. మొత్తం 123 ఎంఓయూల ద్వారా రూ.7,63,210 కోట్ల పెట్టుబడులు సీఎం సమక్షంలోనే ఖరారయ్యాయి. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహా ఇతర మంత్రులు కూడా తమ వంతు కృషి చేసి 490 ఎంఓయూల ద్వారా రూ.5,62,506 కోట్ల పెట్టుబడులను సాధించారు. సదస్సులో తొలి రోజు రూ.3.65 లక్షల కోట్లు, రెండో రోజు రూ.3.49 లక్షల కోట్లు, చివరి రోజు రూ.48,430 కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరాయి.

ప్రధాన రంగాలకు పెద్దపీట

ఈ సదస్సు ద్వారా మొత్తం 12 కీలక రంగాల్లోకి పెట్టుబడుల ప్రవాహం రానుంది. ఇందులో ఇంధన, పరిశ్రమలు, మౌలిక వసతుల రంగాలు అత్యధిక పెట్టుబడులను ఆకర్షించాయి. రంగాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి:

విద్యుత్ రంగం - రూ. 5,33,351 కోట్ల పెట్టుబడులు %-% 2,66,722 మందికి ఉద్యోగాలు

పరిశ్రమలు %-% రూ. 2,80,384 కోట్ల పెట్టుబడులు %-% 5,19,083 మందికి ఉద్యోగాలు

మౌలిక వసతులు %-% రూ. 2,01,758 కోట్ల పెట్టుబడులు %-% 3,06,649 మందికి ఉద్యోగాలు

ఐటీఈ అండ్ సీ %-% రూ. 1,59,467 కోట్ల పెట్టుబడులు - 2,96,315 మందికి ఉద్యోగాలు

ఏపీ సీఆర్డీఏ %-% రూ. 48,711 కోట్ల పెట్టుబడులు %-% 41,625 మందికి ఉద్యోగాలు

టూరిజం %-% రూ. 21,036 కోట్ల పెట్టుబడులు %-% 1,05,804 మందికి ఉద్యోగాలు

ఫుడ్ ప్రాసెసింగ్ %-% రూ. 13,008 కోట్ల పెట్టుబడులు - 47,390 మందికి ఉద్యోగాలు

పట్టణాభివృద్ధి %-% రూ. 4,944 కోట్ల పెట్టుబడులు - 12,150 మందికి ఉద్యోగాలు

టెక్స్ టైల్స్ %-% రూ. 4,490 కోట్ల పెట్టుబడులు - 8,450 మందికి ఉద్యోగాలు

వైద్యారోగం %-% 4,208 కోట్ల పెట్టుబడులు %-% 24000 మందికి ఉద్యోగాలు

విద్యా రంగం %-% రూ. 4,359 కోట్ల పెట్టుబడులు - 3,000 మందికి ఉద్యోగాలు

ఇతర శాఖలు %-% రూ. 50,000 కోట్ల పెట్టుబడులు

మొత్తం మీద, విశాఖ భాగస్వామ్య సదస్సు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వానికి లభించిన గొప్ప విజయంగా నిలుస్తోంది. ఈ ఒప్పందాలు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాలిస్తే రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం మారడంతో పాటు, నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఎడిటర్ వ్యూ

విశాఖ సదస్సులో మన చిన్న కమ్మ కల్యాణ్ గారు కనిపించడంలేదంటబ్బా!

- మొదటి పేజీ తరువాయి

ఆయనపై సోషల్ మీడియా వేదికగా సెటైర్లు వేశారు.తన అధికారిక ఎక్స్ ఖాతాలో అంబటి రాంబాబు నేడు ఓ పోస్ట్ పెట్టారు. "విశాఖపట్నంలో ఆర్భాటంగా జరిగిన %జ××% సమ్మిట్‌లో మన చిన్న కమ్మ కల్యాణ్ గారు కనిపించలేదేంటబ్బా! అని ఆయన ప్రశ్నించారు. ఈ ట్వీట్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో పాటు పవన్ కల్యాణ్‌ను కూడా ఆయన ట్యాగ్ చేశారు.

కులతత్వ విషం, ముస్లింలీగ్-మావోయిస్టు

కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు

- మొదటి పేజీ తరువాయి

తిరస్కరించారని ఆయన అన్నారు.మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో పనిచేసిన కాంగ్రెస్ జాతీయ నాయకులు కూడా రాహుల్ గాంధీ వ్యవహారశైలితో తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షాలు, కార్యకర్తలకు కూడా పరాజయం గురించి వివరించే పరిస్థితి ఆ పార్టీలో లేదని ఆయన విమర్శించారు.

ఈవీఎంలు, ఎన్నికల సంఘం, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను నిందించే సులభ మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకుందని ఆయన అన్నారు. కులతత్వ విషాన్ని చిమ్ముతున్న వారిని ప్రజలు తిరస్కరిస్తారని బీహార్ ఎన్నికలు మరోసారి రుజువు చేశాయని ఆయన అన్నారు. దళితులు అధికంగా ఉండే 38 స్థానాల్లో ఎన్డీయే 34 స్థానాలను గెలుచుకుందని ఆయన తెలిపారు.

ఏపీలో పెట్టుబడుల సునామీ...

- మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా టెక్నాలజీ, పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం వేదికగా పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వ విధానాలను, అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. మరోవైపు, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన శ్రీకాకుళం ఎయిర్ పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పందం కుదరడం విశేషం.

టెక్నాలజీలో ఏపీని అగ్రగామిగా నిలబెట్టే దిశగా...

క్వాంటం టెక్నాలజీ రంగంలో దేశాన్ని ముందుండి నడిపించే సత్తా ఆంధ్రప్రదేశ్‌కు ఉందని మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో 'ఆత్మనిర్భర్ క్వాంటం' అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఏదైనా అమలు చేయాలంటే ముందు ఒక కల ఉండాలి. మేం కేవలం కలలు కనడమే కాదు, వాటిని సాకారం కూడా చేస్తాం. అందుకే దేశంలోనే తొలిసారిగా క్వాంటం మిషన్, యాక్షన్ ప్లాన్, రోడ్ మ్యాప్ రూపొందించాం" అని అన్నారు.

అమరావతిలో ఏర్పాటు చేయనున్న 'క్వాంటం వ్యాలీ'కి నాలుగు మూలస్తంభాలు ఉన్నాయని, అవి.. క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ప్రతిభావంతులైన ఎకోసిస్టమ్ నిర్మాణం, హార్డ్‌వేర్ తయారీ అని వివరించారు. ఈ కార్యక్రమంలోనే ఆంధ్రప్రదేశ్ క్వాంటం కంప్యూటింగ్ పాలసీ (2025-30)ని విడుదల చేశారు. అనంతరం క్వాంటం టెక్నాలజీ రంగంలో 23 సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదిరాయి.ఇదే క్రమంలో, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, సెమీకండక్టర్ల తయారీలో ప్రసిద్ధిగాంచిన సిలికాన్ జెన్ సంస్థ చైర్మన్ చీదా చిదంబరంతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో సెమీకండక్టర్ల ఫ్యాబ్రికేషన్ (ఫ్యాబ్) యూనిట్, చిప్ డిజైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ ఐటీ, సెమీకండక్టర్స్ పాలసీ 2.0 దేశంలోనే అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. దీనిపై చిదంబరం సానుకూలంగా స్పందిస్తూ, AI GPU\T, %CPUలు, హై-బ్యాండ్‌విడ్త్ మెమరీ వంటి అధునాతన భాగాల తయారీపై తమకు ఆసక్తి ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తమ సంస్థలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

గోవా షిప్ యార్డ్స్ ప్రాజెక్ట్స్ హెడ్ ఆదికేష్ వాసుదేవన్‌తో మంత్రి లోకేశ్ భేటీ

రాష్ట్రానికి భారీ పరిశ్రమలను తీసుకురావడంలో భాగంగా గోవా షిప్ యార్డ్స్ ప్రాజెక్ట్స్ హెడ్ ఆదికేష్ వాసుదేవన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ఏపీలో ఇంటిగ్రేటెడ్ షిప్ బిల్డింగ్ రిపేర్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చినందుకు సంస్థను అభినందించారు. దీని ద్వారా సుమారు 20 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆదికేశ్ తెలిపారు. భారత నావికాదళం, తీర రక్షక దళానికి తమ సంస్థ సేవలు అందిస్తోందని, 1057 కిలోమీటర్ల సువిశాల తీరప్రాంతం ఉన్న ఏపీలో పెట్టుబడి పెట్టడం సరైన నిర్ణయమని మంత్రి పేర్కొన్నారు.అలాగే, పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు జెలెస్ట్రా పవర్ సీఈఓ పరాగ్ శర్మతో లోకేశ్ భేటీ అయ్యారు. సోలార్ ప్యానెళ్లు, విండ్ టర్బైన్ భాగాలు, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్ కోసం ఏపీలో ఒక తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పోర్టుకు సమీపంలో యూనిట్ ఏర్పాటు చేస్తే ఎగుమతులకు సులభంగా ఉంటుందని సూచించారు. రాష్ట్రంలో ఉన్న విశాలమైన తీరప్రాంతం, రోడ్డు, రైల్వే కనెక్టివిటీ, త్వరలో అందుబాటులోకి రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు.

అమరావతిలో ఫుట్‌బాల్ స్టేడియం

పారిశ్రామిక రంగంతో పాటు క్రీడారంగ అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ చైర్మన్ కల్యాణ్ చౌబేతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. అమరావతిలో 12 ఎకరాల విస్తీర్ణంలో AIFF ఫుట్‌బాల్ స్టేడియం నిర్మించనున్నట్లు చౌబే ప్రకటించారు. అంతేకాకుండా, పాఠశాల స్థాయి నుంచి ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించేందుకు పీఈటీలకు శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖతో కలిసి పనిచేస్తామని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటీవల డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో 3 శాతం రిజర్వేషన్ కల్పించామని మంత్రి గుర్తుచేశారు.

శ్రీకాకుళంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణం

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతమిచ్చేలా శ్రీకాకుళంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI), ఏపీ ఎయిర్ పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (%APADC%) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఎయిర్ పోర్టు నిర్మాణంతో ఉత్తరాంధ్రలో కనెక్టివిటీ పెరిగి పర్యాటక, ఆర్థిక రంగాలు అభివృద్ధి చెందుతాయని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం స్థల పరిశీలన జరుగుతోందని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు.

ముతాల మూలాలు తేల్చండి..

విశాఖ నగరంలో భారీ ఎత్తున అక్రమ గోమాంసం నిల్వలు బయటపడిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ దందా వెనుక ఉన్న ముఠాల మూలాలను తక్షణమే వెలికితీయాలని విశాఖ పోలీసులను ఆయన ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఘటన వెలుగులోకి రాగానే ఆయన నేరుగా విశాఖ పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఐ అధికారులు మిత్రా కోల్డ్ స్టోరేజీలో జరిపిన దాడుల్లో 1.89 లక్షల కిలోల గోమాంసాన్ని స్వాధీనం చేసుకుని, కేసును పోలీసులకు అప్పగించినట్లు కమిషనర్ పవన్ కల్యాణ్‌కు వివరించారు. కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. ఈ మాంసాన్ని ఎక్కడి నుంచి సేకరించారు, ఎక్కడికి తరలించాలని చూశారు, అనుమతుల్లో ఎలాంటి ఉల్లంఘనలు జరిగాయనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని కమిషనర్ పేర్కొన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అక్రమ గోవధ, గోమాంసం విక్రయాలు, ఎగుమతులను ఏ రూపంలోనూ సహించేది లేదని పవన్ తేల్చిచెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం గోవధ నిషేధంపై ఎంత పటిష్టంగా పనిచేస్తుందో ఈ ఘటనే నిదర్శనమని అన్నారు. గతంలో తన దృష్టికి రాగానే పిఠాపురంలోని జంతు వధశాలను మూసివేయించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఏపీ పాలసీలు అద్భుతం...

సీఎం చంద్రబాబును ప్రశంసించిన రేమాండ్స్ గ్రూప్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి పథంలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో ప్రముఖ పారిశ్రామిక టౌన్‌షిప్‌గా ఉన్న శ్రీసిటీకి అదనంగా 6 వేల ఎకరాల భూమిని కేటాయించనున్నట్టు వెల్లడించారు. శ్రీసిటీని రాష్ట్ర అభివృద్ధికి ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. సదస్సు రెండో రోజైన శనివారం సీఎం చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై తన దార్శనికతను ఆవిష్కరించారు.

సీఐఐ సదస్సు నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు, రేమాండ్స్ గ్రూప్‌కు చెందిన 3 ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, శ్రీసిటీలో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిన 5 కంపెనీలను లాంఛనంగా ప్రారంభించారు. శ్రీసిటీలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన పలు సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకున్నారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "భారతదేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక టౌన్‌షిప్ శ్రీసిటీ. డైకెన్, ఇసుజు, క్యాడ్బరీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇక్కడి నుంచే తమ ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తున్నాయి. మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు శ్రీసిటీకి రావాలి. ఇప్పటికే బెల్జియం, జపాన్, యూకే, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాలకు చెందిన హెల్త్‌కేర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, మెడికల్ పరికరాల కంపెనీల నుంచి రూ.8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులు ఇచ్చాం" అని తెలిపారు.గత రెండు రోజులుగా జరిగిన సదస్సులో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, మొత్తంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని చంద్రబాబు వివరించారు. "త్వరలోనే శ్రీసిటీకి మరో 6 వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తాం. రాబోయే రోజుల్లో 50కి పైగా దేశాలకు చెందిన కంపెనీలు శ్రీసిటీ నుంచి పనిచేస్తాయి. తద్వారా 1.50 లక్షల మందికి ఉద్యోగాలు లభించి, శ్రీసిటీ ఒక అభివృద్ధి మోడల్‌గా మారుతుంది. దీని సమీపంలోనే ఒక ఎయిర్‌స్ట్రిప్ నిర్మించే ఆలోచన కూడా ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం శ్రీసిటీ తరహా మోడల్స్ రాష్ట్రంలో మరిన్ని రావాలి. దేశంలోనే తొలిసారిగా పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఏపీ ప్రభుత్వం ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తోంది. 2028 నాటికి శ్రీసిటీని దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక ప్రాజెక్టుగా మారుస్తాం" అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

రాయలసీమ అభివృద్ధికి బాటలు.. 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం

రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. "2014-19 మధ్య కాలంలోనే కియా కార్ల ఫ్యాక్టరీని సీమకు తెచ్చాం. ఇప్పుడు అదే ప్రాంతంలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ వంటివి ఏర్పాటు చేస్తున్నాం. ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్లు కూడా రాబోతున్నాయి. అనంతపురం జిల్లాకు రేమాండ్స్ సంస్థ రావడం శుభపరిణామం. కియా సమీపంలోనే రేమాండ్స్ ఆటో కాంపోనెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న లక్ష్యాన్ని వచ్చే 3-4 ఏళ్లలోనే చేరుకుంటాం. రేమాండ్స్ సంస్థ 2027 నాటికి తమ ప్రాజెక్టులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చింది. విమానాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో రేమాండ్స్ ఉత్పత్తులు తయారు చేయడం అభినందనీయం" అని అన్నారు.

ఏపీ పాలసీలు భేష్: రేమాండ్స్ గ్రూప్ ప్రశంస

రేమాండ్స్ గ్రూప్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంస్థ ప్రతినిధి గౌతమ్ మైనీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. "ఏపీలో పరిశ్రమలకు అనుమతులు చాలా వేగంగా లభిస్తున్నాయి. ఇక్కడి పారిశ్రామిక విధానాలు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా మేము ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లోకి అడుగుపెట్టాం. ఈ రంగాల్లో మా గ్రూప్ మరింత బలోపేతం అవుతుంది" అని ఆయన వివరించారు.

రూ.3,500 కోట్లకు పైగా కొత్త పెట్టుబడులు

రేమాండ్స్ గ్రూప్ రాష్ట్రంలో మొత్తం రూ.1,201 కోట్ల పెట్టుబడితో మూడు ప్రాజెక్టులను అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయనుంది. రాప్తాడులో రూ.497 కోట్లతో సిల్వర్ స్పార్క్ అపారెల్ పార్క్, గుడిపల్లిలో రూ.441 కోట్లతో ఆటో కాంపోనెంట్ ప్లాంట్, టెకులోడు వద్ద రూ.262 కోట్లతో ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్లను నెలకొల్పనుంది. వీటి ద్వారా ప్రత్యక్షంగా 6,500 మందికి ఉద్యోగాలు రానున్నాయి.

మరోవైపు, శ్రీసిటీలో ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా రంగాల్లో 12 ప్రాజెక్టుల ఏర్పాటుకు రూ.2,320 కోట్ల విలువైన ఎంఓయూలు కుదిరాయి. ఈ పెట్టుబడుల ద్వారా మరో 12,365 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ కార్యక్రమాల్లో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ కె.విజయానంద్, శ్రీసిటీ ఎండీ రవి సానారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా జగన్ ట్వీట్

దివంగత నటుడు, పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా వైసీపీ అధినేత జగన్ ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సందేశాన్ని పంచుకు న్నారు. కృష్ణ కేవలం గొప్ప నటుడే కాదని, తెలుగు సినీ పరిశ్రమకు సరికొత్త మార్గాలు చూపిన గొప్ప ప్రయోగశీలి అని కొనియాడారు."తెలుగు సినీ పరిశ్రమకు నూతన పంథాలు చూపించి, కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న గొప్ప నటుడు పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ గారు. ఎప్పుడూ కొత్తదనాన్ని అన్వేషించిన ప్రయోగశీలి ఆయన. తెలుగు సినీ పరిశ్రమలో ఎంతోమందిని ఆదుకున్న గొప్ప మానవతావాది. కృష్ణ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళు లు" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

కాగా, తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తొలి జేమ్స్‌బాండ్, తొలి కౌబాయ్, తొలి సినిమాస్కోప్, స్టీరియోఫోనిక్ సౌండ్, 70ఎంఎం వంటి ఎన్నో సాహసోపేత ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ఘనత సూపర్ స్టార్ కృష్ణకే దక్కుతుంది. ఆయన వర్ధంతి సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు అభిమానులు కూడా ఆయనను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు.

సీఐడీ విచారణకు హాజరైన రానా, యాంకర్ విష్ణుప్రియ

- మొదటి పేజీ తరువాయి

చేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. విచారణలో భాగంగా ఆమె తన బ్యాంకు ఖాతా వివరాలతో పాటు, బ్యాంక్ స్టేట్‌మెంట్లను కూడా సిట్ అధికారులకు సమర్పించినట్లు తెలిసింది. ఈ ప్రమోషన్ల కోసం చేసుకున్న ఒప్పందాలు, వాటి ద్వారా పొందిన ఆదాయంపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు.ఈ కేసులో మొత్తం 29 మంది టాలీవుడ్ సినీ ప్రముఖులపై కేసులు నమోదయ్యాయి. వీరిలో రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, శ్రీముఖి వంటి వారు ఉన్నారు. రెండు రోజుల క్రితమే నటుడు ప్రకాశ్ రాజ్ కూడా సిట్ ఎదుట హాజరై తన వాంగ్మూలాన్ని ఇచ్చారు.హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా సీఐడీ సిట్ ఈ కేసు దర్యాప్తును చేపట్టింది. రాబోయే రోజుల్లో మరికొంతమంది సెలబ్రిటీలను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి చేసింది ఎవరు? అధోగతి పాలుచేస్తున్నది ఎవరు? మీరే గమనించండి

- మొదటి పేజీ తరువాయి

చెన్నై, హైదరా బాద్‌తో పోటీపడే నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారని గుర్తుచేశారు. కానీ కూటమి నేతలు అధోగతి పాలుచేస్తున్నారని వ్యాఖ్యానించారు."బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ తో పోటీపడే విధంగా విశాఖ నగరాన్ని అభివృద్ధి చేస్తానని జగన్ గారు చెప్పారు. పిల్లలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి విద్య మాత్రమే... అని భావించి, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. విద్య , వైద్యం పేద మధ్యతరగతి ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేశారు.కట్ చేస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఒకవైపు కల్తీ మద్యాన్ని విస్తరించి, విద్య, వైద్యాన్ని పేద మధ్యతరగతి ప్రజలకు దూరం చేశారు. దీనికి తోడుగా విశాఖ బీచ్ లో భార్యాభర్తలు రెండు పెగ్గులు వేసుకునే సౌకర్యాన్ని కల్పించి , గోవాతో పోటీ పడే విధంగా విశాఖ బీచ్ ఉండాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు అంటున్నారు! రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది ఎవరు? అధోగతి పాలు చేస్తున్నది ఎవరు? మీరే గమనించండి!" అంటూ శ్యామల సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

'ఐ-బొమ్మ' ద్వారా వందల కోట్లు ఆర్జించిన ఇమ్మడి రవి!

- మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు. ఈ అరెస్టుతో పైరసీ సామ్రాజ్యంలో అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటైన ఐ-బొమ్మ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడినట్లయింది.

పక్కా ప్లాన్‌తో పోలీసుల ఆపరేషన్

విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి, కరీబియన్ దీవులను కేంద్రంగా చేసుకుని ఐ-బొమ్మ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుడు ఫ్రాన్స్ నుంచి నగరానికి వస్తున్నాడన్న పక్కా సమాచారంతో సైబర్ క్రైమ్ పోలీసులు నిఘా పెట్టారు. అతడు కూకట్‌పల్లిలోని తన నివాసానికి చేరుకోగానే దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. రవి ఫ్లాట్‌లో జరిపిన సోదాల్లో కీలకమైన హార్డ్ డిస్క్‌లు, శక్తివంతమైన కంప్యూటర్లు, సర్వర్లకు సంబంధించిన సమాచారం, ఇంకా అప్‌లోడ్ చేయని కొన్ని తాజా సినిమాల హెచ్‌డీ ప్రింట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ ద్వారా ఐ-బొమ్మ సర్వర్‌లను కూడా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఐ-బొమ్మ వెబ్‌సైట్‌కు కంటెంట్ అప్‌లోడ్ చేసే ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది.

రూ.22 వేల కోట్ల నష్టం.. భారీ పైరసీ సామ్రాజ్యం

ఐ-బొమ్మ ద్వారా ఇమ్మడి రవి వందల కోట్ల రూపాయలు ఆర్జించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేవలం తెలుగు సినిమాల పైరసీ ద్వారానే సినీ పరిశ్రమకు దాదాపు రూ.22 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఈ వెబ్‌సైట్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. గతంలో తెలుగు ఫిల్మ్ యాంటీ-పైరసీ విభాగం ఫిర్యాదు చేసినప్పుడు, ఐ-బొమ్మ నిర్వాహకులు తమను పట్టుకోవడం అసాధ్యమంటూ పోలీసులకు బహిరంగంగానే సవాలు విసిరారు. ఈ సవాలును సీరియస్‌గా తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. గతంలో ఈ నెట్‌వర్క్‌కు చెందిన కొందరు ఏజెంట్లను కూడా అరెస్టు చేసినట్లు సమాచారం.

లోతుగా దర్యాప్తు.. వెలుగులోకి మరిన్ని నిజాలు?

ప్రస్తుతం ఇమ్మడి రవిని పోలీసులు విచారిస్తున్నారు. ఈ పైరసీ నెట్‌వర్క్‌ను అతడు ఒక్కడే నడిపాడా? లేక అతని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? దేశవిదేశాల్లోని అతని నెట్‌వర్క్ ఏ స్థాయిలో విస్తరించింది? అనే కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. మరో రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి, పూర్తి వివరాలను మీడియాకు వెల్లడిస్తామని సైబర్ క్రైమ్ అధికారులు తెలిపారు. ఏదేమైనా, ఈ అరెస్టు సినిమా పరిశ్రమకు పెద్ద ఊరటనిచ్చింది. పైరసీపై సుదీర్ఘకాలంగా చేస్తున్న పోరాటంలో ఇది ఒక కీలక విజయంగా సినీ వర్గాలు భావిస్తున్నాయి.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

గంగవరం ఎస్ఐ వెంకటేష్

గంగవరం, పెన్ పవర్ ,నవంబర్ 15: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని గంగవరం ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గంగవరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రంపచోడవరం కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. నిందితులకు మొదటి తప్పుగా పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధించడం జరిగిందన్నారు. ఇదే నిందితులు తిరిగి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికినట్లైతే జైలు శిక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అలాగే పబ్లిక్ ప్రదేశాల్లో 18 సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగించిన వారిపై కూడా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

జగ్గంపేటలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పాటించని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

నెలలో ఒక్కరోజైన శనివారం కూడా అమలుచేయని వైనం

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువకాని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

జగ్గంపేట, పెన్ పవర్, నవంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతీనెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. ప్రతీ నెల ఒక్కో థీమ్ తో మండల, గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి పరిసరాలు శుభ్రపరచాలి. గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రతిజ్ఞ చేయించి పరిసరాలు శుభ్రపరిచేలా ప్రోత్సహిస్తారు. అయితే ఈ కార్యక్రమం చేపట్టిన మొదట్లో అధికారులు కొన్ని చోట్ల ఫోటోలకు ఫోజులిచ్చి చేతులు దులుపుకున్నారు. నెలలో ఒకరోజు కూడా ఈ కార్యక్రమం పూర్తిగా చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రధానంగా వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే ఇతి వృత్తంతో నిర్వహించాలని స్వయానా జిల్లా కలెక్టర్ షాన్మోహన్ ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బహిరంగ మల విసర్జన, మూత్ర విసర్జన నిర్మూలనపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. విద్యాసంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవడానికి వాటర్ శానిటేషన్ మరియు హైజీన్ కార్యక్రమాలు నిర్వహించి పారిశుధ్య పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అయితే జగ్గంపేట ప్రభుత్వ హైస్కూల్లో తప్ప మరెక్కడా ఈ కార్యక్రమం జరిగినట్లు కనిపించలేదు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా వాటిని బేఖాతరు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. స్వయానా కలెక్టర్ ఆదేశించిన, రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల మూడవ శనివారం నిర్వహించాలని సూచించిన అధికారులు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మండల స్థాయి అధికారులే ఈవిధమైన నిర్లక్ష్యం వహిస్తే క్షేత్రస్థాయిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నీరుగారిపోయే ప్రమాదముందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

బీజేపీ పార్టీ బలోపేతానికి భారీ బైక్ ర్యాలీ

ముఖ్య అతిథిగా పాల్గొన్న రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల

గోకవరం, పెన్ పవర్,నవంబర్ 15: బీహార్ ఎన్నికలల్లో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించిన సందర్భంగా అలాగే భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం, త్వరలోనే బీజేపీ పార్టీ లో చేరడానికి సిద్ధంగా ఉన్న గోకవరం మణికంఠ హాస్పటల్ చైర్మన్ కర్రి సూర్య మణికంఠ, ఆయన అనుచరుడు మాదే హనుమత్ ఆధ్వర్యంలో, బీజేపీ శ్రేణులు గోకవరం గ్రామంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. రాజమహేంద్ర వరం వెళ్లే రహదారిలోని గోకవరం గ్రామానికి ఎంట్రన్స్ లో ఉన్న గంగాలమ్మ ఆలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమైంది. కంబాల శ్రీనివాసరావు, కర్రి మణికంఠ అమ్మవారిని దర్శించుకుని, కొబ్బరికాయలు కొట్టి బైక్ ర్యాలీని ప్రారంభించారు. గంగాలమ్మ ఆలయం నుంచి, పాత బస్టాండ్ మీదగా ఆంజనేయ స్వామి గుడి అక్కడ నుంచి దేవిచౌక్ వరకు బాణసంచా కాల్పులతో బైకు ర్యాలీ సాగింది. అడుగడుగునా కంబాల శ్రీనివాసరావు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దేవిచౌక్ వద్ద కంబాల శ్రీనివాసరావు, కర్రి మణికంఠకి క్రేన్ తో భారీ గజమాల వేసి సత్కరించారు. అనంతరం డ్రైవర్స్ కాలనీ వరకు బైక్ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ బీహార్లో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించడం గొప్ప పరిణామం అన్నారు. ఈ రోజు మన దేశం సురక్షితంగా ఉందంటే మోడీయే కారణమన్నారు. రాబోయే కాలంలో మిగతా రాష్ట్రంలో కూడా బీజేపీ విజయకేతనం ఎగరేస్తుందని అన్నారు. నేను చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై కర్రి మణికంఠ తనతో కలిసి బీజేపీ పార్టీలో నడవడానికి నిర్ణయించుకున్నారని, ఈరోజు బైక్ భారీ ర్యాలీ ఇంత విజయవంతంగా జరగడానికి కారణం మణికంఠ అతని అనుచరుడు హనుమంత్ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, కరిబండి వెంకటేశ్వరరావు, నాగ రమేష్, దేశాల నరేష్, దోసపాటి సుబ్బారావు, తాటికొండ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, పెన్ పవర్, నవంబర్ 15. విశాఖపట్నంలోనీ రాడిసన్ హెటల్లో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకొని చంద్రబాబు నాయుడు ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ ఒక్క రోజులోనే రాష్ట్రానికి 10 లక్షల కోట్లు రూపాయలు పెట్టుబడులు తీసుకురావడం కేవలం చంద్రబాబు నాయుడుకి దక్కిందన్నారు. పారిశ్రామికవేత్తలతో సమావేశంలో పాల్గొని సీఎం బిజీ బిజీగా ఉన్నప్పటికీ తనకు ఆశీస్సులు అందించారన్నారు. అటువంటి అవకాశం కల్పించిన చంద్రబాబుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. నా ఆరాధ్య దైవమైన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంలో పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నియోజకవర్గంలో తన పనితీరును గుర్తించి అటు అభివృద్ధి, సంక్షేమలోనూ అధిక ప్రాధాన్యత కల్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా తన పుట్టినరోజును పురస్కరించుకుని అనేక సేవా కార్యక్రమాలు చేసిన కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గోవింద నాదంతో మార్మోగిన వాడపల్లి క్షేత్రం

ఆర్డీఓ శ్రీకర్ దంపతులకి వాడపల్లి స్వామివారి ప్రత్యేక దర్శనం

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో సందడి నెలకొంది. తెల్లవారుజామున స్వామివారి సన్నిధిలో మేలుకొలుపు సేవ, ఐశ్వర్య లక్ష్మి హెూమం, అలంకరణోత్సవం, సుప్రభాత సేవలను అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మొదటి హారతి తో భక్తులు దర్శన భాగ్యం పొందారు.

ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయం ఆవరణ భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయం మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణాలు చేస్తూ 'గోవిందా%ô% గోవిందా%ô%' నామస్మరణతో పరిసరాలను మార్మోగించారు. దర్శనం అనంతరం ఆలయ సన్నిధిలో ఏర్పాటుచేసిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. సాయంత్రం ఆలయానికి కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ దంపతులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వీరిని ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అర్చకులు స్వామివారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు శ్రీకర్ దంపతులను సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

పశ్చిమగోదావరిలో కార్డన్ సెర్చ్ -అనుమానాస్పద ద్విచక్ర వాహనాల స్వాధీనం

తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 15:పశ్చిమగోదావరి జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున జిల్లాభ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా "కార్డన్ సెర్చ్ ఆపరేషన్" నిర్వహించారు. ద్విచక్ర వాహనాల దొంగతనాలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా నర్సాపురం డీఎస్పీ శ్రీమతి జి. శ్రీవేద నాయకత్వంలో, పెనుగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ ఆర్. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆచంట మండలం పెదమల్లం గ్రామంలో ఉదయం 5:15 గంటల నుండి 7:25 గంటల వరకు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.

సోదాల్లో సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు మరియు యజమాని వివరాలు లేని పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించేందుకు వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ

ప్రతి ద్విచక్ర వాహనం తప్పనిసరిగా యజమాని పేరుపైనే రిజిస్ట్రేషన్ అయ్యి ఉండాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్నారని, నేర రహిత వాతావరణాన్ని ఏర్పరచడానికి ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామాల్లో ఎప్పటికప్పుడు కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఈ తనిఖీల్లో ఆచంట ఎస్సై కె. వెంకట రమణ, పెనుగొండ ఎస్సై కె. గంగాధర్, పెనుమంట్ర ఎస్సై కె. స్వామితో పాటు సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

వరప్రసాద్ మాస్టారు సేవలు స్ఫూర్తిదాయకం

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 15:మండలం లో తాడిపూడి మండల ప్రజా పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు విశిష్ట విద్యాసేవలు అందించిన వరప్రసాద్ మాస్టారు సేవలు స్ఫూర్తిదాయకమని మండల విద్యాశాఖ అధికారి శ్రీ పి.వి. ప్రసాదరావు అన్నారు.

శనివారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.వి.ఎన్.ఎస్. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన వరప్రసాద్ మాస్టారు సన్మాన సభలో ముఖ్య అతిథిగా ప్రసాదరావు పాల్గొన్నారు.విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వరప్రసాద్ మాస్టారు సేవలను సహచర ఉపాధ్యాయులు ఈ సందర్భంగా కొనియాడారు. ఎనిమిదేళ్లకాలం తాడిపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వారు తెలిపారు.అనంతరం మండల విద్యాశాఖ అధికారి, తాడిపూడి పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి వరప్రసాద్ మాస్టారును చిరు జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు అండగా ఎమ్మెల్యే సత్యానందరావు

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 15:ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో శనివారం తెల్లవారుజామున దుర్ఘటనలా దాపురించిన అగ్ని ఆరు గంటల్లో ఇళ్లు, ఆశలు, ఆస్తులను బూడిద చేసింది. కట్టుబట్టలతో మిగిలిన ములగలేటి వెంకన్న, కొమ్మర సుబ్బలక్ష్మి, ములగలేటి సంతోషం కుటుంబాల బాధను ప్రత్యక్షంగా చూసిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వారికి అండగా నిలిచారు.బాధితులను ఓదార్చిన ఎమ్మెల్యే స్వీయ నిధుల నుంచే నగదు, బియ్యం, నిత్యావసరాలను అందజేసి ధైర్యం చెప్పారు. ఇంటి సామాన్లు, పరుపులు, పాత్రలు%ౌ% ఒక్కటూ మిగలకుండా కాలిపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసి, ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయాన్ని త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

విద్యార్థులు వినూత్న ఆలోచనలపై దృష్టి పెట్టాలి - ప్రొఫెసర్ చంద్రశేఖర్ శర్మ

తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 15.విద్యార్థులు వినూత్న ఆలోచనలను పెంపొందించుకుని పరిశోధనల్లో ముందుకు సాగితే కొత్త ఆవిష్కరణలు వెలుగు చూస్తాయని హైదరాబాద్ ఐఐటి కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ శర్మ అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ%-%నిట్)లోని కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఫ్రమ్ ఎర్త్ టు మార్స్ %-% పైనీరింగ్ మెటల్ సీవో2 బ్యాటరీ సొల్యూషన్స్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ చంద్రశేఖర్ శర్మ మాట్లాడుతూ బ్యాటరీలు విద్యుత్తును రసాయన రూపంలో నిల్వ చేసుకుని, అవసరమైనప్పుడు విద్యుత్ శక్తిగా మార్చుకుంటాయని వివరించారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న లిథియం అయాన్ బ్యాటరీలకు ప్రత్యామ్నాయంగా మెటల్ సీవో2 బ్యాటరీలపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. వినూత్న ఆలోచనలు, కృషి, పరిశోధనలతో విద్యార్థులు భవిష్యత్తును మార్చగలరని, అద్భుతాలను సాధించగలరని సూచించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

కార్యక్రమం అనంతరం రిజిస్ట్రార్ పి. దినేష్ శంకర్ రెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వినోత్ కుమార్ రాజా కలిసి ప్రొఫెసర్ చంద్రశేఖర్ శర్మకు శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి. రవికిరణ్ శాస్త్రి, ఆచార్యులు డాక్టర్ సురేంద్ర, డాక్టర్ సుదర్శన దీప తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సీతానగరం, పెన్ పవర్, నవంబర్ 15:మండలంలోని సింగవరం రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ మద్దిపాటి సుజీ రాజు గ్రామ సర్పంచ్ సంగన చిన పోసియ్య శనివారం కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరుగుతా యని రైతులు తమ పండించిన పంటలను రైతు సేవా కేంద్రం ద్వారా విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు ఇతరత్రా అనుమానాలు ఏమైనా ఉంటే విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏవో గౌరీ దేవి, తాసిల్దార్ అంకం శ్రీనివాస్, సొసైటీ సీఈవో పంతం సూర్యనారాయణ, ఎంపీటీసీ కొమ్మిరి శెట్టి వెంకటేశ్వరరావు, గ్రామరైతులు తదితర పాల్గొన్నారు.

అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుర్వేద వైద్యం...

అడ్డతీగల, పెన్ పవర్, నవంబర్ 15: మండల కేంద్రమైనఅడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుర్వేద వైద్యాన్ని మండలంలో గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని, అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రి ఆయుర్వేద వైద్యురాలు షేక్ రేష్మ సుల్తానా కోరారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా ఆయుర్వేద మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు. ఆస్పత్రిలో తమ వద్ద నొప్పులకు షుగర్ వ్యాధికి, దగ్గు, నీరసం ఇలా అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు జరిపి మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, మందులు అన్నిఅందుబాటులోఉన్నాయన్నారు.ఆయా వ్యాధులకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుర్వేద డాక్టర్ ని సంప్రదించవచ్చని మెడికల్ ఆఫీసర్ షేక్ రేష్మ సుల్తానా తెలిపారు .

వ్యక్తిగత పరిశుభ్రత, సమాజ పరిశుభ్రత పై అవగాహనా ర్యాలీ

అంబాజీపేట: పెన్ పవర్, నవంబర్ 15

గ్రామ ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందరూ ఆరోగ్యం ఉండవచ్చునని

గ్రామ సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు అన్నారు. మాచవరం గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛంద స్వర్ణాంధ్రలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత, సమాజ పరిశుభ్రత, బహిరంగ మలవిసర్జన, మూత్ర విసర్జన నివారణపై అవగాహన కల్పించేందుకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని అన్నారు. పంచాయితీ నుండి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఎంపీడీవో బత్తుల మమత, ఉప సర్పంచ్ మట్టపర్తి సాంబం కార్యదర్శి కె వి వి సత్యనారాయణ, వార్డ్ సభ్యులు గోసంగి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్, డ్వాక్రా యానిమేటర్స్, స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

శశి ఇంజనీరింగ్ విద్యార్థి సాయి దీపక్ సాయి అమెజాన్ సంస్థలో అత్యుత్తమమైన 33.75 లక్షల వార్షిక ప్యాకేజీ తో ఉద్యోగం.



తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 15. శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ ఎ.ఐ.ఎం.ఎల్ విభాగానికి చెందిన నంభుల దీపక్ సాయి అమెజాన్ సంస్థలో ఉద్యోగ అవకాశం పొంది, అత్యుత్తమమైన 33.75 లక్షల వార్షిక ప్యాకేజీను సాధించాడు. ఈ సందర్భంగా శశి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ శ్రీ బురుగుపల్లి వేణు గోపాలకృష్ణ , వైస్ ఛైర్మన్ శ్రీ మేకా నరేంద్ర కృష్ణ , కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహ్మద్ ఇస్మాయిల్ దీపక్ సాయిని అభినందించారు. విద్యార్థుల ప్రతిభను వికసింపజేసి, ప్రపంచ స్థాయి సంస్థల్లో అవకాశాలు పొందేందుకు అవసరమైన నైపుణ్యాలు, శిక్షణ అందించడంలో శశి ఇన్స్టిట్యూట్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని వారు పేర్కొన్నారు. దీపక్ సాయి సాధించిన ఈ విశేష విజయం శశి విద్యార్థులకు మరింత ప్రేరణ ఇచ్చిందని కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు కళాశాలకు కృత్జ్ఞతలు తెలిపారు. పెన్ పవర్ పేపర్ కు వార్త రాయండి పెన్ పవర్ పేపర్కు వార్త రాయండి.

రహదారి నిర్మాణం శిలాఫలకానికే పరిమితమా!

- ఏటిగట్టు రోడ్డుకు మంచి రోజులు ఎప్పుడు?

సీతానగరం, పెన్ పవర్, నవంబర్ 15: ఎంతో కీలకమైన ఏటిగట్టు రహదారిని విస్తరించి కొత్తగా రోడ్డు నిర్మిస్తామని అధికారులు ప్రజా ప్రతినిధులు గత కొంతకాలంగా అదుగో, ఇదిగో అంటూ ప్రకటనలు గుప్పించడం తప్ప కార్యరూపం దాల్చడం లేదు. 10 కిలోమీటర్ల పొడవున నిర్మించాల్సిన ఈ రోడ్డు నత్త నడకన సాగుతుండడంతో ఏప్రియల్ 8
వ తేదీన ఎమ్మెల్యే రుడా చైర్మన్ శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు ఆ తర్వాత ఈ రోడ్డు విషయంలో ఎలాంటి కదలిక లేకపోవడంతో ఇదంతా ప్రారంభం శూరత్వమేనా అంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పనులు ఇంకా చేపట్టకపోవడం వల్ల ప్రస్తుతమున్న రహదారి మరమత్తులకు నోచుకోక కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టగా పోవడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై ఎక్కడికి అక్కడ గోతులు పడినందున రాత్రివేళ ప్రయాణానికి భయపడాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. కొత్త రోడ్డు పని మొదలయ్యే వరకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వేగేశ్వరపురం గ్రామంలో ఘనంగా స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

తాళ్ళపూడి, పెన్ పవర్, నవంబర్ 15:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సాసా కార్యక్రమం వేగేశ్వరపురంలో నిర్వహించారు. వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మాట్లాడుతూ వ్యక్తులకు వ్యక్తిగత పరిశుభ్రత, నివాసం ఉండే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

కాకినాడలో నవంబర్ 17న రాష్ట్రీయ ఏక్తా పాదయాత్ర

కాకినాడ, పెన్ పవర్,నవంబర్ 15:సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా భారత ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రీయ ఏక్తా దివాస్ కార్యక్రమాలను అక్టోబర్ 2025 నుంచి అక్టోబర్ 2026 వరకు సంవత్సరం పొడవునా కాకినాడ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శనివారం వెల్లడించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా 15 నుండి 29 సంవత్సరాల వయస్సు గల యువతతో నవంబర్ 17న 5 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు భానుగుడి జంక్షన్ నుండి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర మధ్యాహ్నం 12 గంటల వరకు సాంబమూర్తి నగర్‌లోని ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల వరకు కొనసాగుతుంది. పాదయాత్ర సజావుగా జరిగేందుకు పోలీస్ అధికారులు తగిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పాల్గొనే యువతకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే నగరపాలక సంస్థ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దేశ సమైక్యత భావనను చాటిచెప్పే ఈ పాదయాత్రలో యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ పిలుపునిచ్చారు.

భగవాన్ బిర్సా ముండా కు ఘన నివాళి

రంపచోడవరం, పెన్ పవర్ నవంబర్ 15 : గిరిజన హక్కుల కోసం పోరాటం చేసిన భగవాన్ బిర్సా ముండా 150 వ జయంతిని పురస్కరించుకొని బిర్సా ముండా చిత్రపటానికి రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి, ఎస్టి కమిటీ డైరెక్టర్ గొర్లె దేబోరా సునీత, రెవెన్యూ డివిజనల్ అధికారి పి. అంబేద్కర్,ఏపీవో జనరల్ డీఎన్వి రమణ,ఎంపీపీ బంధం. శ్రీదేవి,ఐట్డిటిసి సభ్యురాలు వంద వెంకటలక్ష్మి,మైనార్టీ బోర్డ్ డైరెక్టర్ షేక్ సుభాని,తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో జన్ జాతీయ గౌరవ్ దినోత్సవ వేడుకలు, దర్తి ఆబా బిర్సా ముండా 150వ జయంతికి ప్రజా ప్రతినిధులతో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో భగవాన్ బిర్సా ముండా 150 జయంతి ఈనెల ఒకటో తారీకు నుండి 15వ తారీకు వరకు బిర్సా ముండా జయంతి ముగింపు పురస్కరించుకొని ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఎస్టి కమిటీ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతం నుండి దేశ స్వతంత్రం కోసం బ్రిటిష్ వారిపై అనేకమంది గిరిజనులు పోరాటం చేయడం జరిగిందని అందుకు మనమందరం పోరాటం చేసిన వారిని ఎప్పటికప్పుడు గుర్తించు కొనే బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. బిర్సా ముండా గిరిజన హక్కుల కోసం భూములపై హక్కుల కోసం బ్రిటిష్ వారిపై పోరాటం చేయడం జరిగిందని ఆయన అన్నారు. అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులతో బ్రిటిష్ వారిపై పోరాటం చేసి ప్రాణాలర్పించారని ఆయన అన్నారు. గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన అన్నారు. ఈ ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. బిర్సా ముండా జయంతి అధికారికంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారు బిర్సా ముండా జయంతి ఈనెల ఒకటో తారీకు నుండి 15వ తారీకు వరకు ఉత్సవాలు ఏర్పాటు చేయడం గిరిజనులకు సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. ఈప్రాంత గిరిజన సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చిన యెడల పరిష్కరించే విధంగా నా వంతు కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ ప్రాంత వివిధ గిరిజన తెగలకు సంబంధించిన గిరిజనులు సంస్కృతిగా సాంప్రదాయాలు కాపాడుకునే బాధ్యత సంబంధిత గిరిజన తెగలపై ఉందని ఆయన అన్నారు. రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి పి. అంబేద్కర్ మాట్లాడుతూ బిర్సా ముండా వివిధ గిరిజన తెగల హక్కుల కోసం పోరాటం చేసి 25 సంవత్సరాల వయసులోనే ఈ లోకాన్ని విడిచి వెళ్లారని ఆయన అన్నారు. గిరిజన హక్కుల కోసం పోరాటం చేసినందుకు బ్రిటిష్ వారు జైల్లో పెట్టడం జరిగిందని అదేవిధంగా కొంతకాలం జైలు జీవితం అనుభవించారని ఆయన అన్నారు. సుమారు 400 మంది గిరిజనులతో దేశ స్వతంత్రం కోసం, గిరిజన హక్కుల కోసం బ్రిటిష్ సామ్రాజ్యంపై దండెత్తడం జరిగిందని ఆయన అన్నారు.మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంత గిరిజనులపై బ్రిటిష్ వారు అనేక ఇబ్బందులు పెట్టారని ఆయన అన్నారు. బ్రిటిష్ వారు 1850 సంవత్సరంలో అడవి ఉత్పత్తులను నివారించి ఈ ప్రాంత గిరిజనులపై ఆధిపత్యం చెలాయించారని ఆయన అన్నారు. 1920 సంవత్సరంలో అనేకమంది గిరిజనులు దేశం కోసం బ్రిటిష్ వారిపై పోరాటం చేయడం జరిగిందని ఆయన అన్నారు. అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులతో దేశ స్వాతంత్రం కోసం పోరాటాలు చేయడం జరిగిందని ఆయన అన్నారు. గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మారుమూల గ్రామాలకు పక్క రోడ్లు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. అనంతరం బ్రిటిష్ వారిపై దేశం కోసం పోరాడిన ద్వారబంధాల చంద్రయ్య నాలుగో తరం వారసులైనటువంటి ద్వారా బంధాల సత్యనారాయణకు, ద్వారా బంధాల నాగ దుర్గ స్వామికి, అబ్బులుకి, అబ్బాయికి నాగమణి, సూర్య చక్రవర్తికి, సాయికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా సాల్వాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. గిరిజన పోరాట యోధులు,స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు ముఖ్య అతిథులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా స్థానిక అంబేద్కర్ సెంటర్ నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశం నిర్వహించారు. అదే విధంగా గుజరాత్ నుండి ప్రధానమంత్రి బిర్సా ముండా జయంతి ఉత్సవాలు వర్చువల్ ప్రోగ్రాం ద్వారా ఐటీడీఏ లో ఏర్పాటు చేయడం జరిగింది . అదేవిధంగా వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ డి వో కె. కోటేశ్వరరావు, అడిషనల్ డి యం %c%హెచ్ డాక్టర్ సరిత, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, తహసిల్దార్ పి.బాలాజీ,డిప్యూటీ తహసిల్దార్ వి. రవీంద్రబాబు, ఫయాజ్ బాషా,పిహెచ్ఓ దేవదానం, పిపిఓ ఎల్. రాంబాబు, డిప్యూటీ ఎంపీడీవో వై. రాజబాబు,సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు జి. తులసీదాస్, కృష్ణమోహన్, సిడిపివోలు కే. ఉమా, సూపరింటెండెంట్ బి.కిషోర్, డి ఈ ఒ, పి వెంకటరమణ, చైతన్య, ప్రధాన ఉపాధ్యాయులు బి ఎస్ కుమార్. స్థానిక నాయకులు వై. నిరంజని దేవి,అనంత మోహన్ వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది, వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల విశ్వ విద్యాలయం ఏర్పాటు కు చర్యలు

- ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్14 :బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం పోరాడిన బిర్సా ముండా భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన యోధుడని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నిర్వహించిన 'గిరిజన స్వాభిమాన ఉత్సవాలు -2025' జాతీయ గౌరవ దినోత్సవ ముగింపు కార్యక్రమం శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా జరిగింది. ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారిణి కె.ఎన్. జ్యోతి అధ్వర్యంలో నిర్వహించిన ముందుగా మొక్కలు నాటడం, జ్యోతిప్రజ్వలన అనంతరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలోనే ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. గిరిజనుల సంక్షేమం కోసం కేంద్రంలోని 9 మంత్రిత్వ శాఖలు కలిపి 23 ముఖ్య పథకాలు రూపొందించాయని తెలిపారు. గిరిజన విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో చేసిన నృత్య ప్రదర్శనలు అభినందనీయమని పేర్కొన్నారు. తక్కువ వనరులు ఉన్న పట్టణాలతో ఏ లక్ష్యాన్నైనా సాధించ వచ్చని యువతకు ప్రేరణనిచ్చే వ్యక్తిత్వం "బిర్సా ముండా"దని సూచించారు. గిరిజన యోధుల త్యాగా లను గుర్తించేందుకు రాంచీ విమానాశ్రయానికి బిర్సా ముండా పేరు పెట్టడం వారి గౌరవాన్ని పెంచుతున్నాయన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ, నవంబర్ 1 నుంచి 15 వరకు బిర్సా ముండా జాతీయ గౌరవ దినోత్సవాలు అన్ని మండలాల్లో విజయ వంతంగా జరిపినట్లు తెలిపారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు పెయింటింగ్, సాంస్కృతిక పోటీలను నిర్వహించినట్లు వివరించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, దేశ సాంస్కృతిక పరిరక్షణలో గిరిజనుల కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు కొండారెడ్డి హరహర వరప్రసాద్, కె ఆర్ ఆర్ సి ఎస్డిసి కె. భాస్కర్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి, వివిధ సంఘాల ప్రతినిధులు తాళ్లూరి బాబు, రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర ఎస్ సి ఎస్ టి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్ గన్నయ్య, గిరిజన సంఘం నాయకులు గరికిపాటి సురేష్, నారాయణ, ఏకలవ్య ఎరుకల సంఘం నాయకులు డా ఎమ్ భాస్కర్, (అసిస్టెంట్ ప్రొఫెసర్ – నన్నయ యూనివర్సిటీ) ఏం. రామకృష్ణ, (జిల్లా ఎరుకల సంఘ అధ్యక్షులు), హౌసింగ్ పిడి ఎన్.బుజ్జి, జిల్లా పంచాయతీ అధికారి వి. శాంతామణి, డీఎల్ డీవో పి. వీణా దేవి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి. శశాంక, గిరిజన వసతి గృహాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాళ్ళపూడి శాఖా గ్రంధాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

తాళ్ళపూడి, పెన్ పవర్, నవంబర్ 15:తాళ్ళపూడి శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయని గ్రంథ లయ అధికారి ఏ.నరేష్ తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాన్ని గురించి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు గుండుభోగుల ఆదినారాయణ, వివిధ పాఠశాలలకు సంబంధించినటువంటి ఉపాధ్యాయులు, చదువరులు, విద్యార్థులతో కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. కార్యక్రమాన్ని రిబ్బన్ కటింగ్ తో ప్రారంభించిన అనంతరం గ్రంథాలయం యొక్క ఆవశ్యకతను గురించి వివరించారు. విద్యార్థులందరూ క్రమంగా గ్రంథాలయానికి రావాలని మన గ్రంథాలయాన్ని మనం వినియోగించుకోవాలని, చదువరులు కూడా ఇంకా ఎక్కువగా వచ్చి గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడాలని, గ్రంథాలయ కమిటీ, సభ్యులు సహకారంతో గ్రంథాలయాన్ని ఇంకా అభివృద్ధి పరచాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు కోరారు. అదేవిధంగా పాఠశాల నుంచి వచ్చినటువంటి ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు కొన్ని ప్రసంగాలు చేశారు. తదుపరి గ్రంథాలయ అధికారి నరేష్ మాట్లాడుతూ ఆదివారం జరగబోయే కార్యక్రమం 58వ జాతీయ గ్రంథాలయ వారసు ప్రతిజ్ఞను చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరు గ్రంథాలయ సభ్యత్వాన్ని తీసుకోవాలని తెలియజేస్తూ ముగించారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ వన సమారాధానికి ఎమ్మెల్యే కి ఆహ్వానం



జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,నవంబర్ 15: ఏలూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కార్తీక వనసమారాధన మహోత్సవానికి పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నీ నాయకులు ఆహ్వానించారు. 23 తేదీన ఆదివారం ఏలూరు సమీపంలో సోది మెల్ల గ్రామం వన సమారాధన నిర్వహించుతారు .శనివారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి అద్దం పట్టే నాలుగో స్తంభం అని ప్రజాస్వామ్య పరిరక్షణకు వారి పాత్ర అపారమైనదని అన్నారు .జర్నలిస్టుల సమిష్టి కార్యక్రమాలకు హాజరవ్వడం గౌరవంగా భావిస్తున్నానని తప్పక హాజరవుతానని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు జబీర్ ,కార్యదర్శి హరీష్, ఉపాధ్యక్షులు శేఖర్ ,జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, ప్రదీప్, మండల ఉపాధ్యక్షులు కొప్పుల సాయి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ కలెక్టరేట్‌లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 15:రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ కార్యక్రమం శనివారం ఉదయం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎస్ రామ్మోహన్ రావుతో పాటు పౌరసరఫరాల, వయోజన విద్య, వికాస శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.పాల్గొన్న సిబ్బంది కార్యాలయ పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రం చేసి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నవంబర్ నెల మూడో శనివారం ఇతివృత్తంగా నిర్ణయించిన వ్యక్తిగత - సమాజ పరిశుభ్రత ప్రాముఖ్యతను ఉద్యోగులకు తెలియజేశారు. అనంతరం మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవో ఎస్ రామ్మోహన్ రావు అందరికీ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వికాస పీడీ కె. లచ్చరావు, పౌరసరఫరాల, వయోజన విద్యాధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పెదపాడు శాఖా గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన

ఏలూరు నవంబర్ 15పెన్ పవర్ : పెదపాడు శాఖా గ్రంధాలయం నందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా : శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగినది. ఈ పుస్తక ప్రదర్శన పెదపాడు జెడ్ .పి. హెచ్ హెచ్.ఎమ్ పి. వెంకటేశ్వరరావు ప్రారంభించినారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించి, గ్రంథాలయంలోని పుస్తకాలు ప్రతి ఒక్కరూ చదివి విజ్ఞానవంతులు కావాలని కోరారు . అనంతరం మారకద్రవ్యాల నిర్మూలనపై పెదపాడు జెడ్.పి.హెచ్ స్కూల్ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు బి. నాగరాజు విద్యార్థిని విద్యార్థులకు చుట్ట, బీడీ ,సిగరెట్, పాన్ పరాగ్,గుట్కా వంటి మారకద్రవ్యాల జోలికి పోకూడదని,వాటి వల్ల నష్టాలు గురించి విపులంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిగా వివరించారు. తదుపరి నాలుగు, ఐదు తరగతుల వారికి చిత్రలేఖనా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ స్కూల్ హెచ్.ఎమ్ పి. అంజనాదేవి, గురుకుల పాఠశాల హెచ్.ఎమ్ ఆర్. బెంజిమైన్ పాల్గొన్నారుఈ కార్యక్రమం గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్ బాబు పర్యవేక్షణలో నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఆహుతులకు కృతజ్ఞతలు తెలిపారు.పోటీలలో పాల్గొనినవిద్యార్థిని ,విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు.

బైక్ యాక్సిడెంట్ లో లైన్మెన్ మృతి

వై రామవరం,పెన్ పవర్, నవంబర్ 15: మండలంలోని దేవరమడుగుల పంచాయతీ లైన్మెన్ ప్రభాకర్ రావు బైక్ యాక్సిడెంట్ లో మృతి చెందారని తోటి ఉద్యోగులు తెలిపారు.

శనివారం ఉదయం లైన్మెన్ ప్రభాకర్ రావు రాజమండ్రి వెళ్ళారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం రాజమండ్రి సమీపంలో రహదారి క్రాస్ చేస్తుండగా ఆటో డాష్ ఇచ్చిందని, వెంటనే బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడ్డారని, వేరొక బైకు ప్రభాకర్ రావు గుద్దడం జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంలో లైన్మెన్ ప్రభాకర్ రావు అక్కడికక్కడే మృతి చెందారని అన్నారు. ఇతనికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. చాలా యాక్టివ్ గా ఉండేవారని, ఇతను చనిపోవడం బాధాకరమైన విషయమని సాహోద్యోగులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

గొల్లపాలెం వర్తక సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన

కాజులూరు, పెన్ పవర్, నవంబర్ 15:కార్తీకమాస పర్వదినాల సందర్భంగా గొల్లపాలెం శ్రీ లక్ష్మి గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 17-11-2025న, అనగా కార్తీకమాసంలోని నాల్గవ సోమవారం, గొల్లపాలెం శివాలయం ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వర్తక సంఘం సభ్యులు తెలిపారు.గొల్లపాలెం, ఆర్యవటం వ్యాపారస్తులు కలిసి నిర్వహిస్తున్న ఈ వన సమారాధన లో పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం కోరింది.

సమాజ సేవలో వెలుగు వెలిగిన జర్నలిస్టు..

* స్వర్గీయ యద్దనపూడి సూర్యనారాయణమూర్తి 97వ జయంతి

తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 15 : సమాజ సేవా భావం, జర్నలిజం లో నిబద్ధత కలిగిన స్వర్గీయ యద్దనపూడి సూర్యనారాయణమూర్తి చిరస్మరణీయులని తాడేపల్లిగూడెం ప్రధాన శ్రేణి గ్రంథాలయ శాఖాధికారి వి. శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల భాగంగా ఆయన 97వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ యద్దనపూడి సూర్యనారాయణమూర్తి విగ్రహానికి పుష్పంజలులు అర్పించి నివాళులు అర్పించారు. ప్రముఖ సీనియర్ సిటీ కేబుల్ ప్రతినిధి సీలే రాజు, సీనియర్ జర్నలిస్ట్ కే. శ్రీనివాసులను పురస్కారాలతో సన్మానించారు. సభకు అధ్యక్షత వహించిన వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ "సమాజానికి చేసిన సేవలు మరువలేనివి. ఆయన స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో సమాజ సేవలో భాగస్వాములు కావాలి" అని అన్నారు.
సీనియర్ జర్నలిస్టు గంగాధర్ రావు మాట్లాడుతూ "సంఘ సేవకులు సంఘానికి రెండు కళ్ళు. స్వర్గీయ సూర్యనారాయణమూర్తి అలాంటి మహనీయుడు" అని పేర్కొన్నారు.
కార్యక్రమంలో తాడేపల్లిగూడెం జర్నలిస్ట్ సంఘ సభ్యులు, యద్దనపూడి సూర్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో వైభవంగా లక్ష తులసి పూజ

అంబాజీపేట: పెన్ పవర్, నవంబర్ 15:మండలంలోని ఇసుకపూడి జక్కంశెట్టివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆలయ నిర్వహకులు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కి లక్ష తులసి పూజ ను వైభవంగా నిర్వహించారు. ఇసుకపూడి గ్రామానికి చెందిన పళ్ళరామారావు కుటుంబం ఆలయానికి గోమాతను అందచేసారు. ఉదయం నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

అన్నదేవరపేటలో శ్రీ బంగారు పాపమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం

తాళ్ళపూడి, పెన్ పవర్, నవంబర్ 15: అన్నదేవరపేట గ్రామ విలవేల్పు,గ్రామస్థుల ఆరాధ్య దేవత శ్రీశ్రీశ్రీ బంగారు పాపమ్మ అమ్మవారి ఉత్సవాలు శనివారం నుంచి 5 రోజుల పాటు అంగరంగ వైభవంగా నాయకులు కాకర్ల సత్యేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు జరుగుతాయని అన్నారు. ఆలయ కమిటి, అర్చకులు, గ్రామ పెద్దలు, యువత, సహాయ సహకారాలతో ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, వినోద కార్యక్రమాలతో ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా తీర్చిదిద్దిన ఘనత కూచిపూడి గణపతి కృష్ణ కే దక్కుతుందని తెలిపారు. ప్రతి కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఇంజరపు సత్యనారాయణ, తొండేపు రమేష్, అర్చకులు సంగమయ్య, శేషగిరి, గ్రామ పెద్దలు, యువతతో చర్చించి చాలా కష్టపడుతూ గ్రామం కోసం, గ్రామ ప్రజలు కోసం కూచిపూడి గణపతి కృష్ణ చేస్తున్న కృషి నిజంగా చాలా గర్వించతగిన విషయం అని సూచించారు.
కూచిపూడి గణపతి కృష్ణ పిలుపుతో పెద్దలు, యువత ఒక్కొక్కరిగా ముందుకు వచ్చి కులమతాలకు, పార్టీలకు అతీతంగా తమ వంతు బాధ్యతగా అన్ని రకాలుగా సహాయసహకారాలు అందించటం జరుగుతుందని అన్నారు. ఈ ఉత్సవాలు ఐదు రోజులు అత్యంత ఘనంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా ఆ అమ్మవారే తోడై కూచిపూడి గణపతి కృష్ణని, ఆలయ కమిటీని, గ్రామ పెద్దలను, యువతను, అర్చకులను నడిపించాలని ఆశిస్తున్నానని కాకర్ల సత్యేంద్ర ప్రసాద్ తెలియజేశారు.

అరుగోలను లో అయ్యప్పస్వామి నామస్వరాలతో మారుమోగిన 36వ పడిపూజ

తాడేపల్లిగూడెం, పెన్ పవర్ నవంబర్ 15: పశ్చిమ గోదావరి జిల్లా అరుగోలను గ్రామంలో శబరిమల యాత్ర సందర్భాన్ని పురస్కరించుకుని అయ్యప్పస్వామి దీక్ష పీఠం వద్ద 36వ పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తుల నినాదాలతో అరుగోలను గ్రామం మారుమోగింది.
35 సంవత్సరాలుగా అయ్యప్పసేవలో నిర్విరామంగా సేవ చేస్తున్న అయ్యప్ప ధన కృష్ణ గురుస్వామి సేవలకు గుర్తింపుగా, కుటుంబ సభ్యులు, అయ్యప్పస్వాములు మరియు భక్తులు ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం కోసం అతి పెద్ద అయ్యప్ప మండపం నిర్మించడంతో కార్యక్రమానికి మరో అందం చేకూరింది.
అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా ఘనంగా తీసుకువచ్చి 18 మెట్ల పై ప్రతిష్టాత్మక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పవిత్ర నది జలాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో శోభాయమానమైన అభిషేకం చేశారు. సుమారు 500 మంది అయ్యప్పస్వామిలు మరియు భక్తులు పాల్గొని స్వామి సైరనుకోషలతో భక్తి ప్రపత్తిని వ్యక్తపరిచారు. అదనంగా, భక్తులను ఆకట్టుకునే విధంగా అయనయ్యులు అయ్యప్పస్వామి, శివపార్వతులు, వినాయకుడు, హనుమంతుడు, శివాజీ వేషధారణలో దేవుడి దర్శనోత్సవాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దారు.
కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

దోసపాడు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం

ఏలూరు నవంబర్ 15 పెన్ పవర్: దెందులూరు నియోజకవర్గం దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం గ్రామ సర్పంచ్ ఏసేబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామల్లో పడకేసిన పారిశుధ్య నిర్వహణకు కూటమి ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో గాడిన పెట్టిందని అన్నారు. ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయం కార్యదర్శి ఆనంద్, సచివాలయం సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కేజీబీవీలో బిర్సా ముండ జయంతి వేడుకలు

వై రామవరం,పెన్ పవర్, నవంబర్ 15: మండలంలోని చవిటి దిబ్బల పంచాయతీ తోటకూర పాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బిర్సా ముండా 151 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందని భారత ఆదివాసీ పార్టీ మండల అధ్యక్షుడు కురసం సత్యనారాయణ దొర తెలిపారు.

బిర్సా ముండా చిత్రపటానికి సర్పంచ్ బచ్చల చిన్నమ్మలు, సత్యనారాయణ దొర పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 1875 నవంబర్ 15వ తేదీన బిర్స ముండా జార్ఖండ్ లో జన్మించారని తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రంలో ముండా తెగకు చెందిన ఆదివాసి స్వతంత్ర సమరయోధుడు అని తెలిపారు. ఆదివాసి సంస్కృతి సంప్రదాయాల కట్టు బాట్ల కోసం బ్రిటిష్ వారితో పోరాడిన తొలి ఆదివాసి వీరుడు అన్నారు. ఆదివాసీలపై అక్రమ పన్నులు వసూళ్లు, మతమార్పిడులు చేయకుండా పోరాడదని తెలిపారు. బ్రిటిష్ వారు బంధించి చెరసాలలో విషమిచ్చి చంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గం భారత్ ఆదివాసి పార్టీ ఇన్చార్జ్ మద్దిటి అంజిరెడ్డి, ఆదివాసి విద్యార్థి విభాగం అధ్యక్షుడు రామదాసు దొర, రాజబాబు, రమేష్ రెడ్డి,కృష్ణ,మంగిరెడ్డి, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

ఏలేశ్వరం యూనిట్ ఏపీ ఎన్ జి జి ఓ అధ్యక్షులుగా డిప్యూటీ ఎంపిడిఓ రామరాజు వర్మ

ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 15:ఏలేశ్వరం యూనిట్ ఏ పి యన్ జి జి ఓ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఏలేశ్వరం ఎంపిడిఓ కార్యాలయంలోఎన్నికల అధికారి శ్రీ కృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఒక్కొక్క పదవికి ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో కార్యవర్గం ఏకగ్రీవమయింది.ఏలేశ్వరం తాలూకా యూనిట్ అధ్యక్షులుగా మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న ఎం.వి.రామరాజు వర్మ ఎన్నిక ఏకగ్రీవం అయింది. అలాగే అసోసియేట్ అధ్యక్షులు గా స్థానిక వీఆర్వో అవసరాల తిరుమలరావు (కిషోర్), ఉపాధ్యక్షులుగా 1. ఎస్ శేష రాజు (సీనియర్ అసిస్టెంట్ నగరపంచాయతీ), 2. బి శ్రీహరి యాదవ్ (సీనియర్ అసిస్టెంట్ ఇరిగేషన్),3. ఎస్ పొన్నాలు (రెవిన్యూ ఇన్స్పెక్టర్ తాసిల్దార్ కార్యాలయం) ఏకగ్రీవంగా ఎన్నిక కాబడ్డారు. కార్యదర్శిగా సిహెచ్ కిరణ్ కుమార్(సీనియర్ అసిస్టెంట్ ఎంపిడిఓ) , సహాయ కార్యదర్శులుగా 1. బీ జీ కే బాలాజీ (సీనియర్ అసిస్టెంట్ ఇరిగేషన్), 2. సి హెచ్ కుమార్ రాజు (సానిటరీ ఇన్స్పెక్టర్ నగర పంచాయతీ), 3. పి సురేష్ కుమార్(జూనియర్ అసిస్టెంట్ ఎంపీడీవో) లు, మహిళా జాయింట్ సెక్రటరీగా ఎస్ విజయలక్ష్మి (ఎం పి హెచ్ ఎస్), ట్రెజరర్ డాక్టర్ ఆర్ సత్యనారాయణ మూర్తి (డబ్యూ ఈ ఏ పంచాయతీరాజ్)లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఎం మేరీ, బాబురావు, టి గీత లక్ష్మి, కే శిరీషల నియమింపబడ్డారు. కాగాఎన్నికల అధికారిగా పిఠాపురం యూనిట్ అధ్యక్షులు ఏ శ్రీ కృష్ణ , అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా పి సురేష్ లు, ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా టీ చార్లెస్ పాల్ వ్యవహరించారు.

ఎన్నికైన నూతన కమిటీని జోయ్ను జిల్లా అధ్యక్షులు గుడేటి రామ్ మోహన్, జిల్లా కార్యదర్శి పాలపర్తి మూర్తి బాబు, జిల్లా ఉపాధ్యక్షులు నరేశ్వ చంద్రరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి కే ప్రసాద్, కార్య నిర్వహణ కార్యదర్శి వై రామకృష్ణ లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.సంఘం అభివృద్ధికి అన్ని విధాల సహకరించి, నిస్వార్థపాతంగా పెద్దల సహకారంతో, సూచనలతో ముందుకు నడిపిస్తామని నూతన కమిటీ ప్రతిజ్ఞ చేశారు.

త్వరలోనే మాజీ ఎంపీ మార్గాని భరత్ అవినీతి చిట్టా బయటపెడతాం

అతని స్నేహితుడు రామశర్మ చెప్పినవి నూరు శాతం వాస్తవాలే
పార్టీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు,యిన్నమూరి దీపు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 15

మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అవినీతి, అక్రమాల చిట్టా త్వరలోనే బయట పెడతామని, అతని స్నేహితుడు రామ శర్మ బహిరంగంగా చెప్పిన అంశాలు వాస్తవమేనని నగర ప్రజలు నమ్ముతున్నారని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, మార్కండేయస్వామి ఆలయం మాజీ చైర్మన్, యిన్నమూరి దీపు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మజ్జి రాంబాబు మాట్లాడుతూ సిటీ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్న తమ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై నిరాధార ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఇటీవల ఆయన స్నేహితుడు, వందా ళ్ళ ఛత్రం మాజీ చైర్మన్ రామశర్మ భరత్ గత ఐదేళ్ల పాల్పడిన అవినీతి , అక్రమాలు విన్నాక విస్మయం కలిగించిందన్నారు. ఇసుక నుంచి రూ.20 లక్షలు, గ్రావెల్ నుంచి రూ 30 లక్షలు నెలకు రూ 60 నుంచి రూ 70 లక్షల చొప్పున ఏడాదికి రూ 7 కోట్లు వసూలు చేశారని, ఐదేళ్లలో 35 కోట్లు కేవలం ఒక వ్యక్తి ద్వారా దోచేస్తే, మిగిలిన ఆరు నియోజక వర్గాల్లో ఇంకెంత దోచేసాడో విస్మయం విస్మయం కలుగుతుందన్నారు. అధికారంలో ఉండగా అవినీతి చక్రవర్తిలా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇష్టారాజ్యంగా దోచేసుకుని భరత్ రామ్ నీతి కథలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ఐదేళ్ల నగరంలో ఏ పని చేయాలన్నా 25 శాతం కమిషన్ తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలు రామశర్మ చెప్పిన అంశాలను బట్టి వాస్తవమేనని తెలుస్తుందన్నారు. భరత్ రామ్ స్నేహితుడు రామశర్మ విప్పిన అవినీతి చిట్టా చూస్తుంటే, 25శాతం కాదని, 50శాతం దోచేసినట్లు అర్ధం అవుతోందన్నారు. ఆధారాలతో సహా రామశర్మ ఆరోపణలు చేస్తే ఖండించే స్థాయిలో భరత్ రామ్ లేదన్నారు. మార్కండేయస్వామి ఆలయం మాజీ చైర్మన్, యిన్నమూరి దీపు మాట్లాడుతూ, మీడియా సాక్షిగా భరత్ రామ్ అవినీతి , ముడుపులు రామ శర్మ చెప్పింది వంద శాతం నిజమన్నారు. తనకు భరత్ నుంచి అనేక బెదిరింపులు, వేధింపులు వచ్చాయని అయినా రామశర్మ భయపడకుండా , ఇప్పుడు రామశర్మ చెప్పింది విన్నాక దారుణంగా స్నేహితులను మోసం చేస్తారా అనిపిస్తోందన్నారు. తాను వైకాపాలోకి వచ్చే విధంగా రామశర్మతో బెదిరించారని, అధికారులతో దాడులు జరిపిస్తామని బెదిరించి వైసిపిలోకి బలవంతంగా చేరేలా భరత్ అన్ని రకాలుగా ఇబ్బంది పెట్టారని యిన్నమూ రి దీపు వివరించారు. పార్టీని వీడి వచ్చేసి తన సొంత గూటికి చేరితే ఎమ్మెల్యే వాసు గౌరవంగా చూస్తున్నారన్నారు. స్నేహితుడు అయినా కూడా భరత్ దారుణంగా వ్యవహరించిందని మండిపడ్డారు. గతంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావును దుర్భాషలాడారని, ఇటీవల ఎమ్మెల్సీ సోము వీర్రాజు న్ని కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని తప్పు పట్టారు. ఇప్పుడు రామశర్మ ఇంటికి అతని అనుచరుడు పీత రామకృష్ణ ను, రౌడీలను పంపించి జుగుప్స కరంగా వ్యవహరించడం భరత్ ద్వంద్వనీతికి అర్థం పడుతుందన్నారు. రాజకీయ లబ్ది కోసం కుట్రలు, కుతంత్రాలు చేయడానికి వెనుకాడని భరత్ రామ్ తీరును ఖండించారు. రాజకీయాలను స్వచ్ఛంద సేవగా భావించి పనిచేసే మనస్తత్వం తమ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దని అన్నారు. ఇప్పటికైనా భరత్ రామ్ తీరు మార్చుకోకపోతే అతని అవినీతి చిట్టా ఆధారాలతో బయటపెడతామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు ఉప్పులూరి జానకి రామయ్య, కంటిపూడి శ్రీనివాస్, శెట్టి జగదీష్, కడలి రామకృష్ణ, పిల్లి శ్యామ్, ముత్యం సత్తిబాబు, ముద్రగడ జయరామ్, షేక్ బషీర్, చాపల చిన్న రాజు, మదినా సాహెబ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా వేడుకల్లో ఆకట్టుకున్న గిరిజన బాలికల ప్రదర్శనలు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 15:భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం శనివారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, జిల్ జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, తదితరులు పాల్గొన్నారు. సాసా లో భాగంగా పురంధరేశ్వరి కలెక్టరేట్ ఆవరణ లో శాసన మండలి సభ్యులు సోమ వీర్రాజు, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినిలు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. గిరిజన సంప్రదాయ నృత్యాలు, గీతాలు, కళారూపాలు కార్యక్రమానికి చైతన్యం తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలను సత్కరించారు. ప్రథమ స్థానం ఆర్ రుచిత కుమారి ద్వితీయ స్థానం,ప్రణీత, తృతీయ స్థానం బి. దీప్తి ప్రియా, కార్యక్రమంలో భాగంగా పి ఎం ఎస్ గర్ల్ హాస్టల్%-%2, విద్యార్థినీలు "మా గూడెం దింసా" నృత్యాన్ని ఆకట్టు కునేలా ప్రదర్శించారు. బొమ్మూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినీలు చెంచుబిడ్డి సాంగ్"ను "తూర్పు కొండల సూర్యుడు" పాటను సమూహీలంగా ఆలపించారు. పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహం%-%1, విద్యార్థినీలు వివిధ ప్రాంతాల గిరిజన సంప్రదాయ వస్త్రధారణతో ఫ్యాషన్ షో, ర్యాంప్ వాక్ తో పాటు నృత్యప్రదర్శనను నిర్వహించి ఆకర్షణగా నిలిచారు. ముఖ్య అతిథులు విజేతకు బహుమతులు అందజేసి అభినందించారు.

20 బ్లాక్ స్పాట్స్ లో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జగ్గంపేట, పెన్ పవర్, నవంబరు 15: జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం నుంచి జగ్గంపేట మీదుగా గండేపల్లి మండలం మురారి గ్రామం వరకు ఉన్న సుమారు 27.2 కిలోమీటర్ల మేర 16వ నెంబరు జాతీయరహదారిపై ఉన్న 20 బ్లాక్ స్పాట్లలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాకినాడ జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన జగ్గంపేట సిఐ వైఆర్ కె శ్రీనివాస్ తో కలిసి ఈ బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఎక్కడెక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో తెలుసుకుని అక్కడ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో చర్చించారు. త్వరలో దీనిపై కార్యాచరణ చేస్తామని ఆయన పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో రోడ్డు ప్రమాదాలు తగ్గడానికి అన్ని చర్యలు చేపడతామని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

అసంఘటిత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ప్రభుత్వం అమలు చేయాలి.

నవంబర్ 20న చలో కలెక్టరేట్ పోస్టర్ విడుదల.

ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 15: అసంఘటిత కార్మికులకు ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక వారి వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లారీ వర్కర్స్ కార్యాలయం వద్ద నవంబర్ 20 ఛలో కలెక్టరేట్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎ.పి బిల్డింగ్ %ఆ%అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని, సంక్షేమ బోర్డు పథకాలు నిలుపుదల చేస్తూ 1214 మెమోని తీసుకొచ్చి భవన కార్మికులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డు పథకాలు పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందని ప్రభుత్వం వచ్చి సంవత్సరం ఆరు నెలలు పూర్తవుతున్న సంక్షేమ బోర్డు పథకాలు ఊసే లేదని, పలుసార్లు మంత్రులను కలిసిన ఎటువంటి స్పందన లేదని ఈ సందర్భంగా అన్నారు తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పెండింగ్ క్లైములు విడుదల చేసి, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, అలాగే భవన నిర్మాణ కార్మిక కార్మికులు 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇవ్వాలని,ఇళ్లు కట్టుకొనే లబ్ధిదారులకు లోన్లు విడుదల చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ధర్నా కు జిల్లాలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల వర్కింగ్ కమిటీ కో-కన్వీనర్ ఉప్పలపు విజయకుమార్ రాజు,పాకలపాటి సోమరాజు,పిల్ల రాంబాబు, లింగంపల్లి నాగేశ్వరరావు, జి.చక్రం,బి.వీరబాబు,సిహెచ్.రాజులమ్మ ,జి.లక్ష్మీ, జి.అప్పలరాజు, లక్ష్మీ ,వి.లక్ష్మీ , కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చెట్లున పాడు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం

ఏలూరు నవంబర్ 15 పెన్ పవర్ : ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు మండలం చెట్లున పాడు గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ గ్రామస్తులతో, విద్యార్థులతో స్వచ్ఛ దివస్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి స్ఫూర్తి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పరిశుభ్రత పాటించాలన్నారు. పరిశుభ్రతపై గ్రామస్తులకు, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, పారిశుద్ధ, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

పంజాబ్ కింగ్స్ రిలీజ్ చేసిన ఆటగాళ్ల లిస్ట్ ఇదే.. ముగ్గురు ఆస్ట్రేలియా ఆటగాళ్లకు గుడ్ బై

హైదరాబాద్ పెన్ పవర్: ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ కు ముందు పంజాబ్ కింగ్స్ ఆస్ట్రేలియా ఆటగాళ్లను టార్గెట్ చేసింది. ఏకంగా ముగ్గురు ఆసీస్ ఆటగాళ్లను ఆ ఫ్రాంచైజీ వదిలేసుకుంది. స్టార్ ప్లేయర్ గ్లెన్ మ్యాక్స్ వెల్ తో పాటు ఆరోన్ హార్డీ, జోష్ ఇంగ్లిస్ లను రిలీజ్ చేసింది. మ్యాక్స్ వెల్, హార్డీని వదిలేసినా గత సీజన్ లో అద్భుతంగా రాణించిన ఇంగ్లిస్ ను రిలీజ్ చేయడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ లో పంజాబ్ మ్యాక్స్ వెల్ నమ్మి రూ. 4.2 కోట్లకు తీసుకుంటే తొలి మ్యాచ్ లోనే డకౌటయ్యాడు. గత సీజన్ లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండా పూర్తిగా నిరాశపరిచాడు.

స్టార్ ఆటగాడిగా ప్రతి మ్యాచ్ లో ప్లేయింగ్ 11 లో చోటు కల్పించినా తీవ్రంగా నిరాశకు గురి చేస్తున్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున 2024 ఐపీఎల్ సీజన్ లో ఒక్క ఇన్నింగ్స్ కూడా ఆడకపోగా.. 2025 లో అదే చెత్త ఫామ్ కొనసాగించాడు. దీంతో 2025 ఐపీఎల్ సీజన్ లో అతన్ని రిలీజ్ చేయక తప్పలేదు. ఆరోన్ హార్డీ విషయానికి వస్తే.. ఈ ఆసీస్ ఆల్ రౌండర్ కు ఒక్క మ్యాచ్ లో కూడా అవకాశం రాలేదు. దీంతో అతని అవసరం లేదని భావించిన జట్టు రిలీజ్ చేసింది. ఇంగ్లిస్ బాగా ఆడినప్పటికీ ఎందుకు రిలీజ్ చేసిందో తెలియాల్సి ఉంది. ఐపీఎల్ మెగా ఆక్షన్ లో పంజాబ్ ఈ ఆసీస్ వికెట్ కీపర్ ను

రూ. 2.60 కోట్ల ధరకు దక్కించుకుంది. ఇండియన్ ఫాస్ట్ బౌలర్ కుల్దీప్ సేన్ కు పంజాబ్ గుడ్ బై చెప్పింది. స్పిన్నర్ ప్రవీణ్ దూబేను కూడా రిలీజ్ చేసింది. ఐపీఎల్ 2025 సీజన్ లో పంజాబ్ కింగ్స్ అద్భుతంగా ఆడి రన్నరప్ గా నిలిచింది. శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలోని పంజాబ్ తిరుగులేని ఆట ఆడినా తుది పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై ఓడింది.

రిటైన్ చేసిన ఆటగాళ్లు:
శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహాల్ వధేరా, ప్రియాంష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, శశాంక్ సింగ్, పైలా అవినాష్, హర్నూర్ పన్ను, ముషీర్ ఖాన్, విష్ణు వినోద్, మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా ఒమర్జాయ్, సూర్యంష్ షెడ్జ్, మిచెల్ సింగ్, విజయ్, మిచెల్ సింగ్, విజయ్, విజయ్‌కుమార్, బార్ట్లెట్, లాకీ ఫెర్గూసన్, యుజ్వేంద్ర చాహల్, హర్‌ప్రీత్ బ్రార్

రిలీజ్ చేసిన ఆటగాళ్లు:
గ్లెన్ మాక్స్‌వెల్, జోష్ ఇంగ్లిస్, ఆరోన్ హార్డీ, కుల్దీప్ సేన్, ప్రవీణ్ దూబే

11 ఏళ్ళ అనుబంధానికి చెక్.. రూ.18 కోట్ల స్టార్ ఆల్ రౌండర్‌ను రిలీజ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్

హైదరాబాద్ పెన్ పవర్: ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ తమ జట్టులోని జట్టు స్టార్ ఆల్ రౌండర్ కు బిగ్ షాక్ ఇచ్చింది. దశాబ్ద కాలంగా కేకేఆర్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన రస్సెల్ కు ఈ సారి ఆ జట్టు ఫ్రాంఛైజీలు రిటైన్ చేసుకోవడానికి ఆసక్తి చూపించలేదు. ఈ విండీస్ ఆల్ రౌండర్ ను ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ కు ముందు రిలీజ్ చేసి ఊహించని షాక్ ఇచ్చింది. అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన రస్సెల్.. గత సీజన్ లో ఘోరంగా విఫలమయ్యాడు. దీంతో కేకేఆర్ రస్సెల్ ను వదులుకునేందుకు సిద్ధమైంది. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆండ్రీ రస్సెల్ 109 మ్యాచ్‌లు ఆడి 2593 పరుగులు చేశాడు. కేకేఆర్ తరపున బౌలింగ్ లోనూ రాణించి 122 వికెట్లు పడగొట్టాడు. రస్సెల్ జట్టులో ఉన్నప్పుడు కేకేఆర్ రెండు టైటిల్స్ కూడా గెలుచుకుంది. రస్సెల్ 2014 నుండి కేకేఆర్ జట్టు తరపున ఆడుతున్నాడు. 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ ముందు రస్సెల్ ను కేకేఆర్ రూ.18 కోట్లకు రిటైన్ చేసుకుంది. 2025 ఐపీఎల్ సీజన్ లో ఈ విండీస్ ఆల్ రౌండర్ 167 పరుగులు మాత్రమే చేసి 8 వికెట్లు పడగొట్టాడు. వయసు ఎక్కువగా ఉండడంతో పాటు ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించడం రస్సెల్ కు మైనస్ గా మారింది.

2025లో అజింక్య రహానే కెప్టెన్సీలోని కేకేఆర్ జట్టు 14 మ్యాచ్‌లలో కేవలం 5 విజయాలతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. 2024 లో శ్రేయాస్ కెప్టెన్సీలో కోల్‌కతా నైట్ రైడర్స్ అద్భుతంగా ఆడి టైటిల్ గెలిచింది. 2025 ఐపీఎల్ సీజన్ లో కేకేఆర్ ప్లే ఆఫ్స్ కు

చేరకపోవడంతో 2026 ఐపీఎల్ సీజన్ లో కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనుంది. 2026 ఐపీఎల్ సీజన్ కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ తమ కోచింగ్ సిబ్బందిలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేసింది. జట్టుకు కొత్త ప్రధాన కోచ్ గా అభిషేక్ నాయర్ నియమించిన కేకేఆర్.. గురువారం (నవంబర్ 13) షేన్ షేన్ వాట్సన్‌ను అసిస్టెంట్ కోచ్‌గా ప్రకటించింది. తాజాగా న్యూజిలాండ్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ టిమ్ సౌథీని కొత్త బౌలింగ్ కోచ్‌గా నియమించుకున్నారు.

ఒకే రోజు 16 వికెట్లు: సౌతాఫ్రికాను తిప్పేసిన జడేజా.. కోల్‌కతా టెస్టులో విజయం దిశగా టీమిండియా

హైదరాబాద్ పెన్ పవర్: కోల్‌కతా వేదికగా ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజు వికెట్ల వర్షం కురిసింది. శనివారం (నవంబర్ 15) ఒక్క రోజే ఏకంగా 16 వికెట్లు కూలడంతో మ్యాచ్ మూడో రోజే ఫలితం రానుంది. మొదట సౌతాఫ్రికా రెచ్చిపోయి టీమిండియాను 189 పరుగులకు ఆలౌట్ చేస్తే.. ఆ తర్వాత టీమిండియా బౌలర్లు అంతకుమించి అన్నట్టుగా వికెట్ల వర్షం కురిపించి

గెలుపు దిశగా దూసుకెళ్తున్నారు. రెండో రోజు అట ముగిసే సమయానికి సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ లో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. క్రీజ్ లో కెప్టెన్ బవుమా (29), కార్బిన్ బాష్ (1) ఉన్నారు. ప్రస్తుతం సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ లో 63 పరుగుల ఆధిక్యంలో ఉంది. టీమిండియాను కేవలం 189 పరుగులకే ఆలౌట్ చేసి ఫుల్ జోష్ లో రెండో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ కు దిగిన సౌతాఫ్రికాకు ఎదరు దెబ్బలు తగిలాయి. టీ విరామానికి ముందే కుల్దీప్ యాదవ్ సఫారీ ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ (11) ను ఎల్బీడబ్ల్యూ రూపంలో ఔట్ చేశాడు. టీ విరామం తర్వాత తొలి ఓవర్ లోనే మార్క్రం (4)ను జడేజా పెవిలియన్ కు పంపడంతో 25 పరుగులకే సౌతాఫ్రికా తమ ఓపెనర్లను కోల్పోయింది. ఇదే ఊపును కొనసాగించిన జడేజా వరుస విరామాల్లో వియాన్ ముల్డర్ (11), టోనీ డి జోర్జీ (2), ట్రిస్టన్ స్టబ్స్ (5) లను ఔట్ చేయడంతో సగం జట్టును కోల్పోయిన సౌతాఫ్రికాను కష్టాల్లో పడింది. 60 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన సౌతాఫ్రికాను ఒక ఎండ్ లో బవుమా పోరాడినా మిగిలిన వారు ఎవరూ సహకరించలేదు. అక్షర్ పటేల్ వికెట్ కీపర్ కైల్ వెర్రెయిన్ (9)ను ఔట్ చేస్తే.. మార్కో జాన్సెన్ (13)ను ఆట చివర్లో కుల్దీప్ పెవిలియన్ కు చేర్చాడు. ప్రస్తుతం 29 పరుగులతో బవుమా పోరాడుతున్నాడు. ఇండియా బౌలర్లలో జడేజా నాలుగు వికెట్లు తీసుకున్నాడు. కుల్దీప్ యాదవ్ రెండు.. అక్షర్ పటేల్ ఒక వికెట్ తీసుకున్నారు. బవుమా మూడో రోజు చివరి మూడు వికెట్లతో ఎలా పోరాడతాడనే దానిపై మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది. తొలి ఇన్నింగ్స్ లో టీమిండియా బ్యాటింగ్ లో ఘోరంగా విఫలమైంది. సఫారీ బౌలర్ల ధాటికి మన బ్యాటర్లు పెవిలియన్ కు క్యూ కట్టారు. శనివారం (నవంబర్ 15) రెండో రోజు ఆటలో బ్యాటింగ్ లో చేతులెత్తేయడంతో తొలి ఇన్నింగ్స్ లో 189 పరుగులకే ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్ లో టీమిండియాకు కేవలం 30 పరుగుల ఆధిక్యం మాత్రమే లభించింది. 39 పరుగులు చేసిన రాహుల్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. సుందర్ (29), పంత్ (27), జడేజా (27) వచ్చిన మంచి ఆరంభాలను పెద్ద స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. సౌతాఫ్రికా బౌలర్లలో హార్మర్ నాలుగు.. జాన్సెన్ మూడు వికెట్లు పడగొట్టారు. హార్మర్,కార్బిన్ బాష్ లకు చెరో వికెట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్ లో సౌతాఫ్రికా 159 పరుగులకు ఆలౌటైంది.

తెలుగు దర్శకుడి సలహా జాన్వీ వింటుందా?

అవును.. జాన్వీకపూర్ ని అతడు నియంత్రిస్తున్నాడు. ఫలానా పరిశ్రమలో మాత్రమే నటించాలని, తిరిగి హిందీ చిత్రసీమకు వెళ్లొద్దని సలహాలిస్తున్నాడు. సక్సెస్ కావాలంటే తెలుగు పరిశ్రమనే నమ్ముకోవాలని కూడా సూచించాడు. అయితే జాన్వీకపూర్ సదరు తెలుగు దర్శకుడి మాటలు వింటుందా? అతడు ఇచ్చిన సలహా ఏమిటి? అది నిజంగా అంత విలువైనదా? వివరాల్లోకి వెళితే..అతిలోక సుందరి శ్రీదేవి తనయ జాన్వీకపూర్ ఇటీవల పూర్తిగా తెలుగు సినిమాలపైనే ఫోకస్ చేస్తున్నట్టు అనిపిస్తోంది. దీనికి కారణం బాలీవుడ్ లో ఈ అమ్మడికి అస్సలు ఏదీ కలిసి రాకపోవడమే. ఎన్నో ఆశలు పెట్టుకున్న పరమ్ సుందరి, సన్నీ సంస్కారికి తులసీ కుమారి లాంటి చిత్రాలు ఫ్లాపులయ్యాయి. అంతకుముందు కూడా కొన్ని వరుస యావరేజ్ సినిమాలతోనే సరిపెట్టుకుంది. హిందీ చిత్రసీమలో జాన్వీ కెరీర్ ఆశించినంతగా వెలగలేదనడానికి ఇవన్నీ సంకేతాలు. జాన్వీకి ఒకదాని వెంట ఒకటిగా అవకాశాలు వచ్చినా కానీ, ఇవేవీ బ్లాక్ బస్టర్లు కావడం లేదు. అందువల్ల రష్మిక మందన్న, కియరా రేంజులో దూసుకుపోవడం ఈ అమ్మడికి కుదరడం లేదు.అయితే తెలుగు దర్శకుడు, ఓదెలా 2 ఫేం అశోక్ తేజ ఇప్పుడు జాన్వీ కపూర్ కెరీర్ జర్నీపై చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిగ్గా మారాయి. అతడి ప్రకారం .. జాన్వీ ఇప్పుడు సరైన చోటులోనే ఉంది. జాన్వీకి హిందీలో కంటే తెలుగులోనే క్రేజ్ ఎక్కువ. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలు గనుక ప్రజలు నెత్తిన పెట్టుకుంటారు. అందువల్ల జాన్వీ ఎదగాలని ఇక్కడ అందరూ పాజిటివ్ గా కోరుకుంటారు. అందువల్ల జాన్వీ టాలీవుడ్ అవకాశాలను వదులుకోకూడదని, ఇక్కడే కొనసాగాలని కూడా అశోక్ కోరుకున్నారు.అయితే అతడి వ్యాఖ్యలను కొందరు తప్పు పడుతున్నారు. జాన్వీ కపూర్ ని ఒకే పరిశ్రమకు కట్టుబడి ఉండాలని నియంత్రిస్తున్నారా? అని ప్రశ్నించారు. హద్దు దాటాడని కొందరు విమర్శించారు. అతడు ఆమె కెరీర్ గురించి మాట్లాడకూడదని కూడా అన్నారు.అయితే అశోక్ సలహాను జాన్వీ కపూర్ లైట్ తీసుకోకూడదు. అభిమానులూ అర్థం చేసుకోవాలి. అతిలోక సుందరి శ్రీదేవిని తెలుగు ప్రజలు తమ సొంత మనిషిగా, తమ ఇంటి ఆడపడుచుగా అభిమానించి ప్రేమిస్తారు. శ్రీదేవి కోసం చెవి కోసుకునే ఫ్యాన్స్ ఉన్నారు ఇక్కడ. మామ్ ఇప్పుడు లేకపోయినా .. తన కోసం ప్రారంభమైన అభిమాన సంఘాలు దశాబ్దాలుగా యాక్టివ్ గా కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నాయి. అందువల్ల తెలుగు రాష్ట్రాల్లో భారీ ఫ్యాన్ బేస్ జాన్వీకి అదనపు బలంగా మారుతుంది. ఒకవేళ జాన్వీకపూర్ హిందీ పరిశ్రమ మత్తులో అక్కడికి వెళ్లినా తనకు నటవారసురాళ్ల నుంచి బలమైన పోటీ ఉంది. అక్కడ గుంపులో గోవిందంలా తనను పట్టించుకునేవాళ్లు ఉండరు. ఇక్కడ అలా కాదు.. ప్రజలు జాన్వీలో శ్రీదేవిని చూసుకోవడానికి పోటీపడతారు. ఇవన్నీ జాన్వీ అర్థం చేసుకుంటుందనే భావిద్దాం.ఎన్టీఆర్ సరసన %-%దేవర-1%-%లో నటించిన జాన్వీ తదుపరి రామ్ చరణ్ పెద్దిలోను కీలక పాత్రతో మెప్పించనుంది. ఎన్టీఆర్, చరణ్ తర్వాత బన్ని, ప్రభాస్, సాయి ధరమ్ తేజ్ లాంటి హీరోలతో జాన్వీ అవకాశాలు అందుకోవడం కష్టమేమీ కాదని కూడా విశ్లేషిస్తున్నారు. చరణ్ సరసన పెద్ది చిత్రం నుంచి విడుదలైన తొలి సింగిల్ గ్లింప్స్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. దేవర తర్వాత పెద్ది కూడా పెద్ద విజయం సాధించి జాన్వీకి బిగ్ బూస్ట్ నిస్తుందని అభిమానులు భావిస్తున్నారు.

ఐశ్వర్య రాజేష్ ఫ్యాషన్ స్టైల్ మనల్ని అసూయపడేలా చేస్తోంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965